జన రాజకీయం కోసం ...


₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 6 సంచిక - 3

పక్షపత్రిక

ఫిబ్రవరి 1 -15, 2015



## ఆగిన లక్ష్మణ రేఖ




విశాఖ బీవీకే కాలేజీలో  ఫ్యాక్ట్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు..





పెనుగొండలో..

కాకినాడలో గాంధీ
విగ్రహం వద్ద ప్రతిజ్ఞ

జన రాజకీయం కోసం...

లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఫిబ్రవరి 1-15, 2015

సంపుటి - 6 సంచిక - 3

## లోపలి పేజీల్లో...

'లక్ష్మణ్ రేఖ' చిరంజీవి –5లో

రేఖను దాటిపోదాం.. లక్ష్మణ్‌ను మరచిపోదాం –6లో

వాస్తు విశ్వాసం, వృథావ్యయం వాస్తవం –9లో

సమాధిలోంచి ఘోషిస్తున్న గాంధీ –12లో

మైత్రీ గీతం –26లో

ఇదీ.. ఇంజినీరంగు! –29లో

### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం
పి. రవిమారుత్
బండారు రామ్మోహన్‌రావు
ఓంకార్
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

## సంపాదకీయం

# రాజకీయాలకు ఓ హెచ్చరిక

యూపీయే-2 హయాంలో దేశం కన్నా పార్టీ ప్రయోజనాలు ఎలా ఎక్కువయ్యాయో, దీనివల్ల భారత ఆర్థికాభివృద్ధి, కోట్లాది యువతకు ఉద్యోగావకాశాలు ఎంత దారుణంగా దెబ్బతిన్నాయో కేంద్ర మాజీ మంత్రి జయంతీ నటరాజన్ ఇటీవల మీడియా ముందు బైటపెట్టిన విషయాలు వెల్లడిస్తున్నాయి.

పార్టీ సంకుచిత ప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాల్ని బలిపెట్టటం వల్ల మౌలిక వసతుల నిర్మాణం ఆగిపోయి అభివృద్ధి చతికిలపడింది, చివరకు దశాబ్దాల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా ఘోరంగా ఓడిపోయింది. దేశం కన్నా పార్టీయే మిన్న అనుకుంటే దేశ ప్రయోజనాలతోపాటు పార్టీ ప్రయోజనాలు కూడా దెబ్బతింటాయి. మంత్రులు దేశానికి జవాబుదారులుగా పనిచేయాలి తప్ప పార్టీలకు, నాయకులకు, వారి కుటుంబాలకు కాదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దేశ ప్రయోజనాలకు పనికొచ్చే విధానాలను అడ్డుకునే దుష్ట రాజకీయాల నుంచి పార్టీలు ఎదగాలి, పార్టీ కన్నా దేశాన్ని మిన్నగా భావించాలి.

తప్పు చేస్తున్న పార్టీని గద్దె దించేదాకా వేచిచూసే పరిస్థితి భారత్‌కు లేదు. మనకున్న ఎదిగే అవకాశాలు పరిమితం. పార్టీలు పరిణితితో వ్యవహరించటం ఇప్పుడు చారిత్రక అవసరం. అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా పర్యటనతో మనం ఎదిగిపోయామని ఎంత చెప్పుకుంటున్నా, 60 లక్షల కోట్ల డాలర్ల ప్రపంచ స్థూల ఉత్పత్తిలో మన వాటా ఇప్పుడు 2 లక్షల కోట్ల డాలర్లు మాత్రమే. ఓ ఇరవయ్యేళ్లు తప్పులు చేయకుండా, అంతర్గత కలహాలు లేకుండా ఐకమత్యంతో కష్టపడితే 2035నాటికి ఇప్పుడు చైనా ఉన్న 10 లక్షల కోట్ల డాలర్ల స్థూల ఉత్పత్తి స్థాయికి చేరుకోగలం.

రాజకీయ పార్టీలకు అధికారమే లక్ష్యం కావటం వల్లే పేదరికం, అరకొర అభివృద్ధి, అవినీతి, నిరుద్యోగం, అధ్వాన్న చదువులు, ఆరోగ్యం వంటి సమస్యల సంక్షోభంలో భారత్ కూరుకుపోయింది. పార్టీలు కేవలం రాజకీయ కార్యకలాపాలకు వేదికలు మాత్రమే. సమర్థవంతమైన పాలన, ప్రజలకు నాణ్యమైన జీవితాన్ని అందించటం వాటి లక్ష్యం. ఏదోకరకంగా ఓట్లు సంపాదించటమే లక్ష్యమనుకుంటే వినాశకర ఫలితాలు వస్తాయి.




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
**తులిప్స్ అపార్ట్‌మెంట్స్**
**6-3-655, ప్లాట్ నెం. 407**
**సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక**
**సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082**
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: 040-23311817
విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500
చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్ | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | 2,500 | |
| పూర్తి పేజీ | 5,000 | 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | 10,000 | 20,000 |
| బ్యాక్‌పేజి | - | 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.



# 'లక్ష్మణ్ రేఖ' చిరంజీవి

మనం తరచు చూసే దృశ్యంలో చూడని కోణాన్ని చూపించేది - కళ. మనం తరచు చేసే ఆలోచనలో ఆలోచించని కోణాన్ని ఆవిష్కరించేది కార్టూన్. అదీ కళే. ఈ రెంటినీ కేవలం 90 సంవత్సరాలు ఉపాసించిన కళాకారుడు ఆర్కే లక్ష్మణ్. మొదటి దృశ్యం - కాకి. లక్ష్మణ్ చిత్రాల్ని చూసినప్పుడు మనం రోజూ చూసే కాకిలో ఇంత కళాత్మకమైన వైవిధ్యం ఉన్నదా అనిపిస్తుంది. మనం రోజూ వినే వార్తల పట్ల ఆయన కార్టూన్ మన మనసుని గిలిగింతలు పెడుతూనే ఒక హెచ్చరిక చేస్తుంది.

మన నాయకులు లక్షలు, కోట్లు ఖర్చు చేస్తున్నారు - ప్రజాసంక్షేమం పేరిట. డ్యామ్‌లు నిర్మిస్తున్నారు- ప్రజాభ్యుదయం పేరిట. ప్రణాళికలు చేస్తున్నారు - ప్రజల్ని ఉద్ధరించే లక్ష్యంతో. ఆస్పత్రులను, విద్యాసంస్థలను, పునరావాస కేంద్రాలను నిర్మిస్తున్నారు- ప్రజల వికాసానికి. కాని, ఇంకా ఇంకా సగటు మనిషి అలాగే అడుక్కు తింటున్నాడు - అన్న సత్యాన్ని స్థూలంగా ఆర్కే లక్ష్మణ్ తన జీవిత కాలమంతా తన కార్టూన్ ద్వారా ఆవిష్కరించారు. ఆయన కార్టూన్లలో గొప్ప శిల్పం ఏమిటంటే ఈ సగటు మనిషి ఏనాడూ నోరు విప్పి మాట్లాడలేదు. కళ గొప్ప సూచన. గొప్ప విశ్లేషణ. గొప్ప కను విప్పు.

నేటితరం రాజకీయ నాయకుల గురించి ఆయన సమీక్ష వినదగ్గది. ''ఆనాటి నాయకులు - నెహ్రూ, మొరార్జీ దేశాయ్, ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు వంటివారు తమదైన వ్యక్తిత్వాలతో కనిపించేవారు. వారి మీద కార్టూన్ వేయడం ఒక అవకాశంలాగ ఉండేది. ఈ తరం నాయకులు- లాలూ ప్రసాద్ యాదవ్, జయలలిత వినా- అందరూ ఒకే మూస. తమదైన వ్యక్తిత్వాలు ప్రత్యేకంగా ఏమీ కనిపించవు.''

నోరెత్తి మాట్లాడని బడుగు మనిషి సమకాలీన సమాజపు సమీక్ష కోసం కోట్లాది మంది పాఠకులు 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో 'యూ సెడ్ ఇట్'అనే రెండంగుళాల కార్టూన్ కోసం 50 సంవత్సరాల పాటు పత్రికను చదివారు. రోడ్ల మీద గుంటలు, ట్రాఫిక్ దిగ్బంధాలు, నీటి ఎద్దడి, బిచ్చగాళ్లు, నాయకుల వెర్రితలలు- ఏవీ ఆయన దృష్టినీ, కార్టూన్లనీ దాటి పోలేదు.

> ''బడ్జెట్ మీద కార్టూన్ వేయాలంటే మీ సమీక్ష నేలబారు మనిషికి చేరాలి. ఆర్థికమంత్రికి కాదు. కార్టూన్ దృశ్యం. బొమ్మ మాట్లాడాలి. వాక్యం కాదు. వాక్యమే కావాలంటే వ్యాసం రాయి. బొమ్మ అక్కరలేదు.''

డెరిల్ డి'మాంటే అనే చిత్రకారుడు ఆయనతో టైమ్స్ ఆఫ్ ఇండియాలో పనిచేశారు. ఒకసారి వ్యవసాయ భూముల మీద గరిష్ట పరిమితిని ప్రభుత్వం ఎత్తి వేసింది. కుంచించుకుపోతున్న రైతు నెత్తి మీద పెద్ద గుది బండని వేసి లక్ష్మణ్ కార్టూన్ పంపారు. ఇది బొత్తిగా 'కథ చెప్పినట్టుంది' అన్నారట డి'మాంటే. వెంటనే ఆ కార్టూన్‌ని తెప్పించి- ఆ బండ మీద రాజకీయ నాయకుడు జల్సాగా కూర్చున్న చిత్రాన్ని వేశారట.


మరో కితకితలు పెట్టే కార్టూన్. ఒక రాజకీయ నాయకుడి కారు ముందు బడుగు మనిషి నిలబడి ఉన్నాడు. నాయకుడు పక్కవాడితో అంటున్నాడు, ''ఇంకా నయం. స్వచ్ఛమైన తాగునీరు, స్కూళ్లు కావాలని అడుగుతారేమోనని భయపడుతున్నాను. అదృష్టవశాత్తూ వాళ్లు ప్రత్యేక రాష్ట్రాన్ని అడుగుతున్నారు.'' ఓ పాత్రికేయుడు, ''అయ్యా! మీ కార్టూన్లలో మేధావి చెణుకులు కనిపించవేం?'' అని అడిగారట. ఆయన సమాధానం- ''బడ్జెట్ మీద కార్టూన్ వేయాలంటే మీ సమీక్ష నేలబారు మనిషికి చేరాలి, ఆర్థికమంత్రికి కాదు. కార్టూన్ దృశ్యం. బొమ్మ మాట్లాడాలి. వాక్యం కాదు. వాక్యమే కావాలంటే వ్యాసం రాయి. బొమ్మ అక్కరలేదు.''

ఆయన తరం కార్టూనిస్టు, ఆయన అభిమాని- సుధీర్ ధర్ ఆ రోజుల్లో 'హిందుస్తాన్ టైమ్స్'లో పనిచేసేవారు. ఓసారి హిందుస్తాన్ టైమ్స్ ఆఫీసులో ఆయన బొమ్మ వేసుకుంటూండగా ఎవరో టేబుల్ దగ్గరకి వచ్చి నిలబడ్డారు. చూస్తే లక్ష్మణ్. ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యి తన సమక్షంలో బడుగు మనిషిని వేయమని అడిగారట. అతి సులువుగా వేసి, దాని మీద 'హిందూస్తాన్ టైమ్స్' అని రాసి పక్కనే ఒక శీర్షిక పెట్టారట: 'టైమ్స్ ఆఫ్ ఇండియా తప్పక చదవండి!'అని. ధర్ ఆత్రుతగా 'మీ ఆటోగ్రాఫ్, ఆటోగ్రాఫ్' అని అన్నారట. లక్ష్మణ్ పెన్ను తీసుకుని ఆటోగ్రాఫ్ రెండుసార్లు పెట్టారట. ఆయనకి ప్రభుత్వం పద్మ భూషణ్ పురస్కారాన్నీ, దరిమిలాను పద్మవిభూషణ్ పురస్కారాన్నీ ఇచ్చింది. వ్యవస్థని దుయ్యబట్టే కళకి వ్యవస్థ అర్పించిన గౌరవప్రదమైన నివాళి ఇది. సామాజిక అరాచకం పట్ల కళాకారుడి విమర్శ- ఆరోగ్యకరమైన చికిత్స అని తన జీవిత కాలంలోనే వ్యవస్థను ఒప్పించిన కళాకారుడు, నేలబారు మనిషిని ప్రజల మనసుల్లో చిరంజీవిని చేసిన అపూర్వ సృష్టికర్త ఆర్కే లక్ష్మణ్. మారని ఈ లోకంలో మార్పు అవసరమన్న స్పృహని ఒక పక్క చిన్న నవ్వుతో, వెనువెంటనే చిన్న కవ్వింపుతో ఒక జీవితకాలం కలిగించిన గొప్ప వైద్యుడు లక్ష్మణ్.

..గొల్లపూడి మారుతీరావు

# రేఖను దాటిపోదాం..

# లక్ష్మణ్‌ను మరచిపోదాం




ఆర్.కె. లక్ష్మణ్ కామన్ మేన్ ఎప్పుడూ, ఎక్కడా మాట్లాడడు. అతన్తో మాట్లాడిస్తే పోలా అనిపించింది. 'చిన్నవాడు సూపర్ మేన్‌ని పలకరించమంటున్నాడు మీ వాణ్ణి సమాధానం చెప్పమనండి' అని పెన్ చేతికిచ్చాను. 'ద సూపర్ మేన్ ఈజ్ ఎ మేన్ ఆఫ్ యాక్షన్ హి నెవర్ స్పీక్స్' అని రాసి సంతకం పెట్టాడు. మర్నాడు 'ఉదయం'లో ఇంటర్వ్యూతో సహా ఆ కార్టూన్ హిట్. 1960వ దశకం మధ్యలో ఈ సంతకం న్యూస్‌ప్రింట్ వాసనతో సహా చేతివేళ్లని తడిమింది. పైన కార్టూన్ గీతలకి గుడ్లప్పగించి కేప్షన్ చదవ్వాయ్ అంది. చిన్నగా నవ్వవాయ్ అని చెప్పలేదు. కానీ పెద్దగానే నవ్వించింది. మెల్లగా ఆ ఇండియన్ ఇంక్ గీతల నల్ల మందు మరిగాం. ఆ మత్తు ఈ రోజుకీ దిగలేదు.

అప్పుడు ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీలో క్లాసులు అవగానే కాళ్లని క్యాంటీన్ వేపు కాకుండా లైబ్రరీకి నడిపించినవి ఈ నల్ల మత్తు గీతలే. ఇంటికొచ్చే 'శంకర్స్ వీక్లీ'లో శంకర్, అబూ అబ్రహాం, బి.వి. విజయన్, కుట్టీ, ప్రకాష్ ఉన్ని ఇంకా ఎంతో మందివి రకరకాల స్టైల్స్ చూసినా ఆర్.కె.లక్ష్మణ్ గీత మరోరకంగా ఉండేది. అప్పుడు తెలుగులో ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, జ్యోతి మంత్లీలో బాపూ కార్టూన్‌లు, ఇలస్ట్రేషన్‌లూ రాజ్యమే లేవి. బొమ్మలేసే సరదావల్ల ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లన్నీ అదే పనిగా చూడ్డం దారి వెతుక్కోవడం మామూలే.

ఇప్పుడు 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో పెద్ద పొలిటి కల్ కార్టూన్, 'యు సెడ్ ఇట్' పేరుతో ప్యాకెట్ కార్టూన్ వచ్చేవి. ఇందులో బట్టతలా, కళ్లజోడూ, గళ్లకోటూ పంచే, చేతిలో గొడుగుతో 'కామన్ మేన్' ఉండేవాడు. ఇం ట్లో భార్యతో వాదనల దగ్గర్నుంచి సంచితో కూరగా యల బజారుకు పోవడం, మర్నాడు అమాంతంగా మం త్రివర్గ సమావేశంలోకి తొంగిచూడ్డం, అంతలోనే ఊరే గింపులు చెదరగొట్టే పోలీసుల లాఠీచార్జీలూ ప్రత్యక్షం కావడం, ఇలా సర్వాంతర్యామిగా ఉండేవాడు. ఈ సామాన్యుడు తన ఇంటి గొడవల కిటికీలోంచి దేశ రాజకీయాల్ని చూసి, రకరకాలుగా విస్తుపోడం షాక్ తినడం, బెంగపడ్డం చూపించాడాయన. నాలుగు దశాబ్దాలపైనే ప్రపంచాన్ని చూసి, మనకు చూపించిన ఈ సామాన్యుడి విగ్రహాన్ని మన దేశంలో రాష్ట్రపతి ఆవిష్కరించడం అపురూపమైన గౌరవమే. అలాగే మెగసెసె అవార్డు అందుకున్న ఏకైక భారతీయ కార్టూనిస్టూ ఈయనే.

ప్రముఖ వ్యంగ్య చిత్రకారుడు ఆర్.కె. లక్ష్మణ్ కన్నుమూశారు. "కామన్ మేన్" పాత్రను సృష్టించి, తన వ్యంగ్య చిత్రాల్లో దానికి స్థానమిచ్చిన ఆయన మూత్ర సంబంధిత ఇన్ఫెక్షన్‌తో ఆసుపత్రిలో చేరారు. అనంతరం శరీరంలోని పలు అవయవాలు పనిచేయక పోవడంతో పరిస్థితి విషమించి సోమవారం తుదిశ్వాస విడిచారు. ప్రముఖ రచయిత దివంగత ఆర్.కె. నారాయణ్‌కు సోదరుడైన లక్ష్మణ్‌కు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. తన వ్యంగ్యచిత్రాలతో ఎంతగానో అలరించిన ఆర్.కె.లక్ష్మణ్ పూర్తిపేరు రాసీపురం కృష్ణస్వామి లక్ష్మణ్. 1921 అక్టోబరు 24న మైసూరులో జన్మించిన ఆయనకు చిన్ననాటి నుంచి చిత్రకళపై విపరీతమైన ఆసక్తి ఉండేది. పంచ్, టిట్‌బిట్స్, స్ట్రాండ్, బిస్టాండర్ వంటి మ్యాగజైన్లలోని బొమ్మల ప్రేరణతో ఆయన చిత్రాలు గీసేవారు.. చేతికి దొరికిన కాగితాలు, గోడలు.. ఇలా ఎక్కడ పడితే అక్కడ కనిపించే ప్రతి బొమ్మను గీస్తుండే లక్ష్మణ్‌లోని ప్రతిభను ఆయనకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడు ఒకరు తొలిసారిగా గుర్తించారు. లక్ష్మణ్ ఈ విషయాన్ని తన స్వీయచరిత్ర "ది టన్నెల్ ఆఫ్ టైం"లో కూడా ప్రస్తావించారు. మైసూర్ విశ్వవిద్యాలయంలో చదువుకున్న ఆయన అంతకుముందు ముంబయి జె.జె.స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చేరేందుకు ప్రయత్నించగా వారు ఆయన నైపుణ్యం లేదంటూ దరఖాస్తును తిరస్కరించడం విశేషం. మైసూరులో చదువుకునే రోజుల్లోనే ఆయన బ్లిట్జ్, స్వరాజ్య వంటి పత్రికలకు కార్టూన్లు వేసేవారు.



60వ దశకంలో కుష్వంత్‌సింగ్ ఎడిటర్‌గా ఉన్నప్పుడు 'ఇలస్ట్రేటెడ్ వీక్లీ'లో ఈయన కలర్ క్యారికేచర్లు వచ్చేవి. 'నేనెన్నడూ కలవని స్టార్స్' లాంటి పేరుతో సినీ తారలు, అశోక్ కుమార్, దేవానంద్, ఎస్‌డీ బర్మన్, మధుబాల ఇంకా ఎంతో మంది బొమ్మలు వింతగా ఉండేవి. మ్యాగజైన్ కవర్ మీద కూడా గొడ్డలి పట్టు కున్న జియావుల్ హక్ బొమ్మ మిలి టరీ యూనిఫామ్‌లో, మెడల్స్‌తో సహా పంచరంగుల్లో భయపెట్టేది. లోపల మేరియో మిరాండా తన సొంత స్టైల్‌తో గోవా, బొంబాయి, వీధులూ, భవంతులూ, పిల్లలూ, పిల్లులూ, కుక్కలూ, ఆడామగా అందాల విచ్‌క్రాఫ్ట్ అదరగొట్టేది. 70వ దశకంలో టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్ వాళ్లే 'సైన్స్ టుడే' మ్యాగజైన్ తెచ్చారు. అందులో ఓ పేజీనిండా లక్ష్మణ్ కార్టూన్‌లుండేవి. సైంటిస్టులూ, వాళ్ల లేబొరేటరీ, గినీ పిగ్స్ అన్నిటినీ అమాయకంగా చూస్తున్నట్టే వెటకారాలుండేవి. ఒక సైంటిస్టు జుట్టంతా పీక్కుంటూ బావురుమంటుంటాడు. కిటికీలోని తెల్ల ఎలుక, తోటి ఎలుకతో చెప్తుంటుంది. 'పదేళ్లుగా నా మీద ప్రయోగాలు చేస్తున్నాడు. చివర్లో నేను కుడి నుండి ఎడమకు నడిస్తే ఎక్స్‌పరిమెంట్ సక్సెస్. ఆ సంగతి తెలిసే నేను ఎడమ నుండి కుడికి నడిచా' ఇలాటివి ఎన్నో.

70వ దశకంలో జర్నలిజంలో చేరా. కొన్ని కార్టూన్లు కూడా గీసీ 80ల్లో హైదరాబాద్ వచ్చాక ఆయన్ని మొద టిసారి కలవడమైంది. హిమాయత్‌నగర్లో ఆయన బంధువులో ఫ్రెండ్సో ఉన్నారు. ఎప్పుడూ వచ్చిపోయే వాడు. నేనో కార్టూన్ రిడిల్ పట్టుకెళ్లా. ఆయన కామన్ మేన్ ఎప్పుడూ, ఎక్కడా మాట్లాడడు. అతన్తో మాట్లా డిస్తే పోలా అనిపించింది. నా బొమ్మలూ లక్ష్మణ్ కామన్ మేన్ సూపర్ మేన్‌లాగా అరవై అడుగుల పొడుగున్నట్టు పాదాలూ, గొడుగు మాత్రమే కనిపిస్తుంటాయి. 'ఉదయం' పత్రికలో నా కామ న్ మేన్ ఆ గొడుగు చువ్వ చివరలాగుతూ

మిగతా 34వ పేజీలో

ఉండేవాడు. ఈ సామాన్యుడు తన ఇంటి గొడవల కిటికీలోంచి దేశ రాజకీయాల్ని చూసి, రకరకాలుగా విస్తుపోడం షాక్ తినడం, బెంగపడ్డం చూపించాడాయన. నాలుగు దశాబ్దాలపైనే ప్రపంచాన్ని చూసి, మనకు చూపించిన ఈ సామాన్యుడి విగ్రహాన్ని మన దేశంలో రాష్ట్రపతి ఆవిష్కరించడం అపురూపమైన గౌరవమే. అలాగే మెగసెసె అవార్డు అందుకున్న ఏకైక భారతీయ కార్టూనిస్టూ ఈయనే.

60వ దశకంలో కుష్వంత్‌సింగ్ ఎడిటర్‌గా ఉన్నప్పుడు 'ఇలస్ట్రేటెడ్ వీక్లీ'లో ఈయన కలర్ క్యారికేచర్లు వచ్చేవి. 'నేనెన్నడూ కలవని స్టార్స్' లాంటి పేరుతో సినీ తారలు, అశోక్ కుమార్, దేవానంద్, ఎస్‌డీ బర్మన్, మధుబాల ఇంకా ఎంతో మంది బొ మ్మలు వింతగా ఉండేవి. మ్యాగ జైన్ కవర్ మీద కూడా గొడ్డలి పట్టు కున్న జియావుల్ హక్ బొమ్మ మిలి టరీ యూనిఫామ్‌లో, మెడల్స్‌తో సహా పంచరంగుల్లో భయపెట్టేది. లోపల మేరియో మిరాండా తన సొంత స్టైల్‌తో గోవా, బొంబాయి, వీధులూ, భవంతులూ, పిల్ల లూ, పిల్లులూ, కుక్కలూ, ఆడామగా అందాల విచ్ క్రాఫ్ట్ అదరగొట్టేది. 70వ దశకంలో టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్ వాళ్లే 'సైన్స్ టుడే' మ్యాగజైన్ తెచ్చారు. అందులో ఓ పేజీనిండా లక్ష్మణ్ కార్టూన్‌లుండేవి. సైంటిస్టులూ, వాళ్ల లేబొరేటరీ, గినీ పిగ్స్ అన్నిటినీ అమాయకంగా చూస్తున్నట్టే వెటకారాలుండేవి. ఒక సైంటిస్టు జుట్టంతా పీక్కుంటూ బావురుమంటుంటాడు. కిటికీలోని తెల్ల ఎలుక, తోటి ఎలుకతో చెప్తుంటుంది. 'పదేళ్లుగా నా మీద ప్రయోగాలు చేస్తున్నాడు. చివర్లో నేను కుడి నుండి ఎడ మకు నడిస్తే ఎక్స్‌పరిమెంట్ సక్సెస్. ఆ సంగతి తెలిసే నేను ఎడమ నుండి కుడికి నడిచా' ఇలాటివి ఎన్నో.

70వ దశకంలో జర్నలిజంలో చేరా. కొన్ని కార్టూన్లు కూడా గీసీ 80ల్లో హైదరాబాద్ వచ్చాక ఆయన్ని మొద టిసారి కలవడమైంది. హిమాయత్‌నగర్లో ఆయన బం ధువులో ఫ్రెండ్సో ఉన్నారు. ఎప్పుడూ వచ్చిపోయే వాడు. నేనో కార్టూన్ రిడిల్ పట్టుకెళ్లా. ఆయన కామన్ మేన్ ఎప్పుడూ, ఎక్కడా మాట్లాడడు. అతన్తో మాట్లా డిస్తే పోలా అనిపించింది. నా బొమ్మలూ లక్ష్మణ్ కామన్ మేన్ సూపర్ మేన్ లాగా అరవై అడుగుల పొడుగున్నట్టు పాదాలూ,

> **'చిన్నవాడు సూపర్ మేన్‌ని పలకరించమంటున్నాడు మీ వాణ్ణి సమాధానం చెప్పమనండి' అని పెన్ చేతికిచ్చా ను. ఒక్కక్షణం ఆలోచించి 'ద సూపర్ మేన్ ఈజ్ ఎ మేన్ ఆఫ్ యాక్షన్ హి నెవర్ స్పీక్స్' అని రాసి సంతకం పెట్టాడు**

గొడుగు మాత్రమే కనిపిస్తుంటా యి. 'ఉదయం' పత్రికలో నా కామ న్ మేన్ ఆ గొడుగు చువ్వ చివర లాగుతూ పలకరించమని అరుస్తుం టాడు. లక్ష్మణ్ దాన్ని చూసి 'గుడ్ ఏం చేయాలని' అడిగాడు. 'చిన్నవాడు సూపర్ మేన్‌ని పలకరించమంటున్నాడు మీ వాణ్ణి సమాధానం చెప్పమనండి' అని పెన్ చేతికిచ్చా ను. ఒక్కక్షణం ఆలోచించి 'ద సూప ర్ మేన్ ఈజ్ ఎ మేన్ ఆఫ్ యాక్షన్ హి నెవర్ స్పీక్స్' అని రాసి సంతకం పెట్టాడు. మర్నాడు 'ఉదయం'లో ఇంటర్వ్యూతో సహా ఆ కార్టూన్ హిట్. అలా ఆయన్ని హైదరాబాద్‌లో, బెంగళూరులో చాలాసా ర్లు కలిశాం. లక్ష్మణ్ కార్టూన్‌ల గురించీ, ఆయనతో మా గుంపు అనుభవాల గురించీ ఎంతేనా ఎన్నైనా చెప్పుకో వచ్చు. శంకర్స్ వీక్లీ, తర్వాత ఈయనా, మరెంత మందో 70వ దశకం వరకూ తెచ్చిన సాంప్రదాయం ఎందుకో ముందుకు పోవడం లేదు. వెనక్కిపోతోంది కూడా. ఫలా నా బ్రాండ్ హ్యూమర్ కోసం పొద్దుటే ఆత్రంగా పేపర్ లాక్కుని చూసే పరిస్థితే లేదు. రాజకీయ పార్టీలూ, కార్పొరేట్ కంపెనీలూ ఎడ్వర్‌టైజింగ్ అన్నీ కలిసి జర్నలి జంలో కాళ్లూ, వేళ్లూ, ఒళ్లూ మొత్తం దూర్చేస్తున్నాయి. సొంత అభిప్రాయం, సొంత వ్యాఖ్యానం అంటే కత్తులు దూసే అసహనం కట్టలు తెంచుకుంటోంది. లక్ష్మణ్ తరం వెళ్లిపోయింది. ఈ తరానికి ఆ సంగతి తెలియా ల్సిన అవసరం లేదు. ఇదే జర్నలిజమనీ, ఇదే కార్టూనిం గ్ అనీ, మనమేం చేస్తే అది ఘనకార్యమనీ జబ్బలు చరు చుకుందాం. కన్వీనియంట్‌గా లక్ష్మణ్‌ని మరిచిపోదాం. లేకపోతే చాలా ఇన్‌కన్వీనియన్స్.

– మోహన్

(వ్యాసకర్త ప్రముఖ కార్టూనిస్టు)

# వాస్తు విశ్వాసం, వృథావ్యయం వాస్తవం

జాతకం, జ్యోతిష్యం, వాస్తు నమ్మేవారి సంఖ్య మన దేశంలో పెరుగుతోందే కానీ తగ్గడం లేదు. భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత వీటికి గౌరవం పెరిగింది. తెలుగు రాష్ట్రాలలో ఈ నమ్మకాలు అందరికంటే అధినాయకులకే అధికం. శాస్త్రీయంగా ఆలోచించేవారు వీటిని మూఢనమ్మ కాలుగా కొట్టిపారేస్తారు. శాస్త్రీయ దృక్పథం కలిగిన వారిలో సైతం వాస్తు, జ్యోతిష్యం వంటి అంశాలను విశ్వసించేవారు చాలామంది ఉన్నారు. నమ్మకం ఉన్నా, లేకపోయినా వాస్తు నిబంధనలు పాటిస్తే నష్టం ఏముంది అని సరిపెట్టుకు నేవారు అనేకమంది.

దైవభక్తి లాగానే వాస్తు విశ్వాసం కూడా వ్యక్తిగతం. మన రాజ్యాంగం ప్రకారం వీటిని ప్రభుత్వాలకు ఆపాదించకూడదు. అంతరిక్షంలోకి ఉపగ్రహాలను ప్రయోగించేముందు ఇస్రో అధినేత తిరుమలను దర్శించుకొని వెంకన్నకు దండం పెట్టుకోవడం, అంతరిక్ష ప్రయోగ విజయభారాన్ని దేవుడిపైన వేయడం అశాస్త్రీ యం అనడంలో సందేహం లేదు.

**నెహ్రూ తరువాత నుంచి ఇదే ధోరణి**

శాస్త్రీయ స్పృహ కలిగిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు ఇటువంటి ఛాందస ధోరణులు ఉండేవి కావు. ఆయన కుమార్తె ఇందిరాగాంధీని ఎమర్జెన్సీ రోజులలో అభద్రతాభావం వెంటాడేది. కంచిస్వామిని తరచు సంప్రదించేవారు. సోనియా గాంధీ కూడా జ్యోతిషుల సలహా మేరకు ఫోన్ నంబర్లూ, కారు నంబర్లూ మార్చి వేశారు. సంఖ్యాశాస్త్రజ్ఞుల సూచన మేరకు జయలలిత ఇంగ్లిష్‌లో తన పేరు చివరలో అదనంగా మరో అక్షరం జోడించారు. అయినా ఆమెకు పదవీచ్యుతి తప్పలేదు. వీరి వ్యక్తిగత విశ్వాసాల వల్ల ప్రభుత్వ నిధులు ఖర్చు కాలేదు. చిన్న మార్పులతో వాస్తుదోష నివారణ మార్గాలు అనుసరించారు. అంతే.


కానీ ఆంధ్రప్రదేశ్‌లో వాస్తునమ్మకాలతో వందలకోట్ల రూపాయల ప్రజా ధనం వృథా అవుతోంది. సంజీవరెడ్డి నుంచి జలగం వెంగళరావు వరకూ ఏ ముఖ్యమంత్రి కూడా వాస్తుదోష నివారణకు ప్రభుత్వం చేత ఖర్చు పెట్టించలేదు. మర్రి చెన్నారెడ్డి హైదరాబాద్‌లోని తార్నాకాలో స్వగృహంలో కొన్ని మార్పులు చేయించుకున్నారు. అంజయ్య బరకత్‌పురాలోని స్వగృహంలో కొత్త అంతస్తు నిర్మించిన తర్వాత రాజీవ్‌గాంధీ చేతిలో అవమానంపాలై, పదవిని కోల్పోయారు. ఆ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులలో చాలామంది తమ విశ్వాసాలే ప్రభుత్వ విశ్వాసాలనుకున్నారు. వాస్తులోపాలను పరిహరించడంకోసం సచివాలయంలో కట్టడాలను కట్టడం, కూల్చడం సర్వసాధారణమైపోయింది. నందమూరి తారక రామారావు సచివాలయ ప్రహరీకి సమాంతర ప్రహరీగోడ కట్టించారు. సమాంతర ప్రహరీ నిర్మాణం ప్రారంభించిన కొద్దిరోజులకే ఎన్టీఆర్ శస్త్రచికిత్స కోసం అమెరికా వెళ్లారు. అన్నగారు అటు వెళ్లగానే సోదరుడు నాదెండ్ల భాస్కర రావు ముఖ్యమంత్రిగా ప్రకటించుకున్నారు. తర్వాత నెలరోజులపాటు మహోద్య మం సాగించి ఎన్టీఆర్ అధికారం తిరిగి హస్తగతం చేసుకున్నారు.

**రెండు ఖజానాలకూ మాత్రం శని**

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలను పరిపాలిస్తున్న ఇద్దరు ముఖ్యమంత్రులూ ఒకే వాస్తు బడిలో చదివిన వత్సలు. వైఎస్

రాజశేఖరరెడ్డి హయాంలో నిర్మించిన క్యాంప్ ఆఫీసు భవనం ఇద్దరు ముఖ్యమంత్రులకూ నచ్చలేదు. ముఖ్యమంత్రి అధికార నివాసంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉంటున్నారు కానీ క్యాంప్ కార్యాల యాన్ని వినియోగించడం లేదు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేక్‌వ్యూ గెస్ట్ హౌస్‌లో తిప్పలు పడ్డారు కానీ క్యాంప్ కార్యాలయం ఉపయోగించడం లేదు. కేసీఆర్ కుందన్‌బాగ్‌లో రెండు భవ నాలలో మార్పులు చేయించి తీరా అక్కడికి వెళ్ళాలన్న సంకల్పం విరమించుకున్నారు. ఒక అంచనా ప్రకారం నిరుడు జూన్ నుంచి ఇప్పటి వరకూ సచివాలయంలో వాస్తుదోషాల నివారణ పేరుతో చంద్రబాబునాయుడు 81 కోట్లూ, కేసీఆర్ 34 కోట్లూ ప్రజాధనం వ్యయం చేశారు. ఇతర మంత్రులూ, ఉన్నతాధికారులూ చేసిన ఖర్చు అంతా కలిపితే మొత్తం రూ. 173 కోట్లు అని ఒక ఉన్నతాధికారి తెలిపారు.





సరికొత్త చరిత్ర సృష్టించే కార్యక్రమాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి తల పెట్టారు. వాస్తు ప్రకారం సవ్యంగా లేని సచివాలయంలో చిన్నచిన్న మార్పులు చేయడం కంటే ఏకంగా సచివాలయాన్ని ఎర్రగడ్డ పిచ్చి ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తే బాగుంటుందనే ఆలోచన మదిలో మెదిలిందే తడవుగా మంత్రివర్గ సమావేశంలో సహచరులతో పంచుకున్నారు. ప్రభుత్వ ఉన్నతాదికారులతోనూ కొత్త ఆలోచనపై చర్చించారు. అద్భుతమైన ఆలోచన అన్నవారే కానీ ఇదేమి చాదస్తం అని అనలేదు. ఎవరైనా మనసులో అనుకున్నారేమో కానీ బయటికి అనే సాహసం చేయలేదు.

చార్లెస్ కొరియ అనే ప్రఖ్యాత వాస్తుశిల్పి నిర్మించిన మధ్య ప్రదేశ్ విధాన సభాభవనంలో దుష్టశక్తులున్నాయని రాజకీయ నాయకులు కొందరి ప్రగాఢ విశ్వాసం. 1996లో కొత్త భవనం వినియోగంలోకి వచ్చిన తర్వాత సభాపతి, ఉప సభాపతి మరణిం చారు, మొత్తం ఇరవైమందికి పైగా శాసనసభ్యులు (మాజీలు కారు)అకాల మరణం చెందారు. వ్యక్తులు వార్ధక్యం వల్లనో, ప్రమాదాలలోనో, వ్యాధుల కారణంగానో మరణిస్తారు కానీ భవనాల కారణంగా చనిపోరని ప్రముఖ హేతవాది సమాల్ ఎడుమురుకు చేస్తున్న వాదనను పెడచెవిన పెడుతున్నారు.

**పార్లమెంటు భవంతికీ వాస్తు దోషమేనట**

ఢిల్లీ పార్లమెంటు భవనం వాస్తుశాస్త్ర నిబంధనలకు అనువుగా లేదని వాస్తుశాస్త్ర కోవిదుడు అశ్వనీకుమార్ బన్సల్ చాలా సంవత్సరాల కిందటే చెప్పారు. పార్ల మెంటు భవనం ఎదుట 1993 అక్టోబరు రెండో తేదీన మహాత్మాగాంధీ విగ్రహం ప్రతిష్ఠాపన జరిగినప్పటికీ వాస్తు పూర్తిగా గాడి తప్పిందని ఆయన నమ్మకం. త్రికోణం ప్లాట్‌లో గుండ్రటి కట్టడం నిర్మించిన కారణంగా అత్యున్నత చట్టసభలో చర్చలు ఫలప్రదం కావడం లేదని వాదన. పొరుగు దేశాలతో యుద్ధాలు రావ డానికీ, దేశంలో అశాంతి పెరగడానికీ ఇదే మూలం అని కొందరి విశ్వాసం. లోక్ సభలో స్పీకర్ దక్షిణ ముఖంగా కూర్చోవడం, ప్రెస్‌గ్యాలరీ కింద

ఆయన స్థానం ఉండటంతో ఆయన సభ్యులను సమర్థంగా నియంత్రించలేక పోతున్నారనీ, ఫల ప్రదమైన చర్చకు దోహదం చేయలేకపోతున్నారనీ బన్సల్ అంటున్నారు. నిజానికి లోక్‌సభలో ప్రెస్‌గ్యాలరీలో కూర్చున్న మీడియా ప్రతినిధులకు స్పీకర్ మొహం కానీ, ప్రధాని, ప్రతిపక్ష నాయకుల మొహాలు కానీ కనిపించవు. పార్లమెంటును తాత్కాలికంగా విజ్ఞానభవన్‌కు మార్చి ప్రస్తుత పార్లమెంటు భవనాన్ని చతు రస్రం లేదా దీర్ఘచతురస్రాకారంలో పునర్మించాలని వాదిస్తున్నారు. ఎవరు వింటారు?

మన దేశంలో ఎంతో మంది సమర్థులైన ముఖ్యమంత్రులుగా, ప్రజారంజకు లైన పాలకులుగా, దార్శనికత కలిగిన ప్రగతికాముకులుగా చరిత్రపుటలలోకి ఎక్కారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అభివృద్ధికి పథకాలు రచించి అమలు చేసే అద్భుతమైన అపూర్వమైన అవకాశం తొలి ముఖ్యమంత్రులుగా ఎన్నుకొని కేసీఆర్‌కూ, చంద్రబాబునాయుడికీ ప్రజలు ఇచ్చారు.

ఆ సువర్ణావకాశాన్ని సద్విని యోగం చేసుకోకుండా వీరిద్దరూ స్వప్నవీధులలో విహరిస్తూ ఆచరణ సాధ్యం కాని కార్యక్రమాలను అలవోకగా ప్రకటిస్తున్నారు. ఇదివరకు ఏదైనా పథకాన్ని ప్రకటించే ముందు అధికారులూ, ముఖ్యమంత్రులూ సాధ్యాసాధ్యాలను అధ్య యనం చేసి, నిధుల కేటాయింపులు ఖాయంగా లభిస్తాయన్న నమ్మకం కుదిరిన తర్వాత ప్రకటన చేసేవారు.

## గాలిమేడలు దిగాలి

వాస్తవానికి తెలంగాణ ముఖ్యమంత్రి కొన్ని చక్కటి కార్యక్రమాలను ప్రకటిం చారు. కొన్ని జయప్రదంగా అమలు చేయడం ప్రారంభించారు. పొరుగున చంద్రబాబునాయుడు చేత పిల్లిమొగ్గలు వేయిస్తున్న రైతుల రుణమాఫీ పథకాన్ని కేసీఆర్ సునాయాసంగా అమలు చేయగలిగారు–నిధుల పరిస్థితి నయం కనుక. ఆసరా పథకం కింద సహాయం మొత్తాన్ని రెండు వందల నుంచి వెయ్యి రూపాయలకు పెంచి ఆ ప్రకారం చెల్లిస్తున్నారు. ఆహారభద్రత కార్యక్రమం కింద అర్హత కలిగిన కుటుంబంలో ఎంత మంది సభ్యులుంటే అంతమందికీ ప్రతి ఒక్కరికీ ఆరు కిలోల చొప్పున మేలురకం బియ్యం ఇస్తున్నారు. బీడీ కార్మికులకు వెయ్యి రూపాయల వంతున జీవన భృతి చెల్లించాలన్న నిర్ణయం కూడా అభినం దించదగినది. పేదల పట్ల సానుభూతి ఉన్నదనీ, తరతరాలుగా అన్యాయానికీ, పీడనకూ, వివక్షకూ గురైన దళిత, ఆదివాసీ వర్గాలకు మేలు చేయాలన్న సత్సం కల్పం కేసీఆర్ ప్రభుత్వానికి ఉన్నదనే సందేశం ప్రజలకు అందుతోంది కానీ దానితో పాటు అనేక సందేహాలు పట్టిపీడిస్తున్నాయి.

ఆదివాసీలకూ, ముస్లింలకూ చెరి పన్నెండు శాతం రిజర్వేషన్లు అమలు చేయడం సాధ్యం కాదని రాజ్యాంగ ప్రవీణులు చెబుతున్నప్పటికీ కేసీఆర్ అదే హామీని పదేపదే చేయడంలో అర్థం ఏమిటి? నగర మధ్యంలో ఉన్న సచివాల యాన్ని అక్కడి నుంచి కేవలం వాస్తు కోసం ఎర్రగడ్డకు తరలించడం ఎందుకు? శనివారం మోండా మార్కెట్‌ను సందర్శించిన ముఖ్యమంత్రి పెక్కంతస్తుల భవన ప్రాంగణంలో మార్కెట్‌ను నిర్మిద్దామంటూ వాగ్దానం చేసినట్టు వార్త. పెక్కం తస్తుల నిర్మాణాల పట్ల అంత ప్రేమ ఎందుకో ఉన్నతాధికారులకు సైతం అంతు బట్టడం లేదు. ఆకాశ హర్మ్యాల గురించి ఆలోచించడం కంటే ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలో చేసిన ప్రకటనలను చిత్తశుద్ధితో అమలు చేస్తే కేసీఆర్‌కు గొప్ప కీర్తి దక్కుతుంది. వాటిలో ఒకటి దళితులకు మూడెకరాల భూమి ప్రభుత్వం కొనుగోలు చేసి ఇస్తామన్నది. ఈ పని కనుక చేయగలిగితే ఇందిరా గాంధీ తర్వాత దళితులు కేసీఆర్‌కే ఎక్కువగా రుణపడి ఉంటారు. మంచినీటి సరఫరాకు ఉద్దేశించిన వాటర్‌గ్రిడ్‌నూ, చెరువుల పునరుద్ధ రణకోసం మిషన్ కాకతీయనూ పట్టువిడవకుండా అమలు చేయగలిగితే, విద్యలో, వైద్యంలో ప్రభు త్వ ప్రమేయం పెంచి పేదలకు నాణ్యమైన విద్య, వైద్య సౌకర్యాలు అందుబాటు లోకి తేగలిగితే చాలు కేసీఆర్‌ను చరితార్థుడిని చేయడా నికి. గాలిమేడలు అక్కరలేదు.

**కె.రామచంద్రమూర్తి**

# సమాధిలోంచి ఘోషిస్తున్న గాంధీ



గాంధేయ పద్ధతులకు భారతదేశం సజీవ సమాధి కట్టిందా అని స్వాతంత్ర్య భానోదయ కాలంలో కొందరు ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు గాంధీజీయే 1947 ఆగస్టు 17 హరిజన్ పత్రికలో సమాధానం రాశారు:

ఇంకా నన్ను సజీవంగా సమాధి చేయలేదనే నేను ఆశిస్తున్నాను. ప్రజానీకానికి ఇంకా నా సిద్ధాంతాలు, పద్ధతుల్లో నమ్మకం పోలేదనే విశ్వాసం నాకు ఉంది. అలా వారికి నాలో నమ్మకం పోయిందని రుజువైన రోజున వారి దారి వారిదవుతుంది. నేను సజీవంగా సమాధిచేయబడ్డానని చెప్పవచ్చు. కాని నేను ఒక్కడినే అయి నా సరే, నా ఆశ తేజోవంతంగా వెలుగుతున్నంతకాలం సమాధిలోకూడా నేను జీవించివుంటాను.

అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా గణతంత్ర దినోత్సవ సందర్భంలో భారతదేశం వచ్చినప్పుడు గాంధీ సమాధిని దర్శించి, రాజ్‌ఘాట్ సందర్శకుల పుస్తకంలో 'ప్రపంచానికి అరుదైన కానుక బాపు అని వ్రాస్తూ తాను నిత్యం బాపూ నుంచి స్ఫూర్తి పొందుతూ వుంటానని' అన్నారు. భారత 'దేశంలో బాపూజీ నాయకత్వంలో అహింసాయుతంగా ఉద్యమం జరిగి వుండకపోతే అమెరికాలో మార్టిన్ లూథర్ కింగ్‌కి ఆ విధంగా ఉద్యమం నడిపే స్ఫూర్తి వచ్చి వుండేది కాదు అని ఆయన రాశారు. ఈ మాటలు అక్షరాలా నిజం.

మార్టిన్‌లూథర్ కింగే కాదు... ఆఫ్రికాలో మండేలా, మియన్మార్‌లో ఆంగ్‌సాన్‌సూకీ మొదలైనవారు కూడా గాంధీ నుంచి స్ఫూర్తి పొంది, తమ దేశాలలో సమస్యల

పరిష్కారానికి గాంధీ విధానాలను కొంతవరకైనా అనుసరించారు. నెల్సన్ మండేలా దక్షిణాఫ్రికాకు అధ్యక్షుడుగా ప్రమాణం చేసేటప్పుడు తన వెనక స్టేజి మొత్తం ఆవరించిన గాంధీజీ చిత్రం పెట్టుకున్నారు. మరొక ప్రక్క మన దేశంలో గాంధీ నేటి సమాజానికి సరైన వ్యక్తి కాదని అనుకునేవాళ్ళు కూడా ఎక్కువవుతున్నారు. అంతేగాక గాంధీని హత్యచేసిన నాథూరాం గాడ్సేకి దేవాలయం కట్టాలని ప్రయత్నిస్తున్నవారు వున్నారు. గాడ్సే కూడా గాంధీజీకి వంగి కాళ్ళకి నమస్కరించి గాని ఆయనను చంపలేకపోయాడు. అంతేకాదు కోర్టులో ఇచ్చిన వాంగ్మూలంలో గాంధీజీ అంటే తనకు ప్రత్యేకంగా ద్వేషం లేదని, కాకపోతే ఆయన ముస్లింలను ఎక్కువ ప్రేమగా చూసి, వారి వైపు ఎక్కువ మొగ్గు చూపడం చేత హిందూ సమాజానికి నష్టం కలుగుతుందని భావించి గాంధీని హత్య చేశానని గాడ్సే చెప్పాడు. ఈ విధంగా నిజంగా గాంధీ ప్రపంచానికి ఒక కానుకే. అంతేకాదు ఆయన నిరంతరం స్ఫూర్తిదాతే.

1959 ఫిబ్రవరిలో మార్టిన్ లూథర్‌కింగ్ గాంధీ పురస్కారాన్ని అందుకునేందుకు భారతదేశం వచ్చినప్పుడు ఆయన వినోబాను కలుసుకోవడానికి రాజస్థాన్ వచ్చారు. ఆ సందర్భంలో వినోబా వెంట వున్న నాకు మార్టిన్ లూథర్ కింగ్‌ను కలిసి అరగంటసేపు మాట్లాడే అరుదైన అవకాశం లభించింది. ఆయన భారతదేశ పర్యటనను దాదాపు పూర్తి అయిపోయిన తరువాత ఒక మూడు -నాలుగు రోజుల్లో తిరిగి వెళ్లిపోతారనగా పర్యటననిర్వాహకులతో తనకు గోరాను కలవాలని వుందని, అది సాధ్యమవుతుందా అని అడిగారు. అపుడు ఆయనతో మనం దక్షిణాదిన వున్నప్పుడు మీరు అడిగివుంటే మద్రాసునుంచి గానీ, బెంగళూరు నుంచి గానీ విజయవాడ వెళ్ళి కలవగలిగే వాళ్ళం లేదా ఆయనే మన వద్దకు వచ్చి కలిసివుండే వారు.

ఇప్పుడు ఆయన ఢిల్లీ రావడానికి సమయం చాలదు. కానీ ఆయన కుమారుడు లవణం వినోబా వద్ద వున్నాడు. రేపు మీరు వినోబాను కలవడానికి వెళుతున్నారు కనక అక్కడ లవణాన్ని కలుస్తానంటే ఆ ఏర్పాటు చేస్తాం అన్నారు. దానికి ఆయన కలుస్తానన్నారు. ఆ విధంగా నేను మార్టిన్ లూథర్ కింగ్‌ను కలిశాను.

ఆయన 'యాన్ ఎథీస్ట్ విత్ గాంధీ' పుస్తకం చదివానని, గాంధీ అన్నట్లుగా తాను కూడా తన ఆస్తికత్వం ఒప్పు అని గాని మరొకరి నాస్తికత్వం తప్పు అని గాని అనలేనని, ఇద్దరం సత్యాన్వేషులమేనని అంగీకరిస్తానని, అందుచేతనే తాను బాప్టిస్టు పాస్టర్‌నైనా గోరా యెడల గౌరవం పెంచుకున్నానని, అందుకే ఆయన్ని కలసి మాట్లాడలనుకున్నానని నాతో అన్నారు.

ఆ విధంగా నాన్నగారి గురించి చాలా విషయాలు వివరంగా ఆయనకు చెప్పే అవకాశం నాకు కలిగింది. చివరలో నేను ఆయన్ను ఒక ప్రశ్న వేశాను. గాంధీని మీరు ఎలా చూస్తారు? అని. దానికాయన గాంధీ నా ఆయుధం అన్నారు. నల్ల జాతివారి సమానహక్కుల పోరాటానికి గాంధీని కింగ్ ఆయుధంగా స్వీకరించారు. గాంధీని సమాజం భరించలేకపోయినట్లే కింగ్‌ను కూడా అమెరికన్ సమాజం భరించలేకపోయింది. గాంధీ వలెనే కింగ్ కూడా హత్యకు గురయ్యారు. కానీ ఆయన ఆయుధాన్ని మాత్రం ఎంతోమందికి పంచి ఇచ్చారు. నేటికీ ఆఫ్రికన్ అమెరికన్ల సమాన హక్కుల ఉద్యమంలో గాంధీ పద్ధతులే అనుసరించబడుతున్నాయి. నేను 1966-67లో అమెరికా వెళ్ళినప్పుడు మరల రెండు సార్లు మార్టిన్ లూథర్ కింగ్‌ను కలిసి మాట్లాడే అవకాశం వచ్చింది. అహింసకు సత్యాన్వేషణ ముఖ్యమైనప్పుడు సత్యాన్వేషణ ఆస్తికుల సొంత హక్కు కానప్పుడు, నాస్తికులు కూడా సత్యాన్వేషణ చేస్తున్నారని అంగీకరించినప్పుడు తమ ఆస్తికత్వాన్ని చూసుకునే పద్ధతిలో పెద్ద మార్పు వస్తుంది. అది గాంధీజీలో వచ్చింది. గాంధీని ఆయుధంగా స్వీకరించిన మార్టిన్ లూథర్

**గాంధీని మీరు ఎలా చూస్తారు? అని. దానికాయన గాంధీ నా ఆయుధం అన్నారు. నల్ల జాతివారి సమానహక్కుల పోరాటానికి గాంధీని కింగ్ ఆయుధంగా స్వీకరించారు. గాంధీని సమాజం భరించలేకపోయినట్లే కింగ్‌ను కూడా అమెరికన్ సమాజం భరించలేకపోయింది.**

కింగ్‌లో కూడా అటువంటి ఆలోచనే వచ్చింది. అందుకే ఆయన ప్రపంచ శాంతికొరకు నా వంటి నాస్తికులతో కలసి పనిచేయాలని అనుకున్నారు. దురదృష్టం కొద్దీ కింగ్ హత్య వల్ల నాకు ఆ అవకాశం లేకుండా పోయింది.

కొద్దిరోజుల క్రిందటే టీవీలో మన విద్యా విధానం గురించి ఒకరు మాట్లాడుతూ.. పిల్లలు పారా–పలుగు వదిలి పలకా –బలపం పట్టాలని అన్నారు. ఇదీ, గాంధీ దేశంలో ఈ రోజున విద్యా విధానం. గాంధీని అర్థంచేసుకున్న తీరు!

గాంధీ తన విద్యా విధానంలో ప్రతి విద్యార్థి ఒక ప్రక్క కూరగాయలు పండిస్తే, మరొక ప్రక్క తకిలీగానీ, రాట్నం గానీ వడుకుతూ..దాని చుట్టూ అల్లుకుంటూ విద్యను నేర్చుకోవాలని కోరారు. అపుడు శ్రమ శక్తి విలువ తెలుసుకుని శ్రమ శక్తికి గౌరవం ఇచ్చి విద్యావంతులవుతారు. కాని నేటి విద్యా విధానం శ్రమ శక్తికి గౌరవం ఇచ్చేదిగా లేదు. అందుచేత మనం గాంధీని ఆయుధంగాను తీసుకోవటం లేదు, గాంధీ వల్ల స్ఫూర్తినీ పొందటం లేదు.

ఇటువంటి విద్యా విధానంలోచదువుకుని పైకివచ్చిన వారికి గాంధీ మీద గౌరవం ఎలా వుంటుంది? అహింస మీద నమ్మకం ఎలా పెరుగుతుంది? సత్యం, సమానత్వం కోసం కృషి చేయాలని తపన ఎలా వస్తుంది? ఇవి రానపుడు హింస ఎలా తగ్గుతుంది? అసమానతలు ఎలా తగ్గుతాయి? హింస, అసమానతల మధ్య పరస్పర ద్వేషం, పరస్పర అసహనం ఎక్కువ కావా? ఈ ప్రశ్నలు నేడు మనం వేసుకోవాలి. భారతదేశం గాంధీని ప్రపంచానికి కానుకగా యిస్తే మార్టిన్ లూథర్ కింగ్ గాంధీని ఆయుధంగా భావించారు.

మనం గాంధీ స్ఫూర్తికి విరుద్ధమైన జీవిత విధానాన్ని (పాశ్చాత్య సమాజ ప్రభావంతో) నిత్య జీవితంలో అనుసరిస్తున్నాము. తద్వారా ప్రకృతిని, మానవతా విలువల్ని ధ్వంసం చేసే ప్రక్రియలో భాగమవుతున్నామే తప్ప, ప్రకృతిని రక్షించగలిగే శక్తిని, మానవతా విలువలను నిత్య జీవితంలో ఆచరించే శక్తిని పొందగలుగుతున్నామా? 'నేను ఒక సాంఘిక విప్లవకారుడ్ని. నా యుగపు అత్యుత్తమ విప్లవకారుడ్ని అని కొందరు నన్ను అంటారు. అది నిజం కాకపోవచ్చు. కాని నేను ఒక విప్లవకారుడ్ని. అహింసాయుత విప్లవకారుడ్ని' అని గాంధీ 1946లో అన్నారు. గాంధీని మనం భారత స్వాతంత్ర్యోద్యమ నాయకుడిగా మాత్రమే స్వీకరించాము గాని, నవసమాజ నిర్మాతగా ఆయన్ని అంగీకరించలేదు. అందుచేత స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గాంధీ అనవసరం అనుకున్నాం.

**నేను సజీవంగా సమాధిచేయబడ్డానని చెప్పవచ్చు. కాని నేను ఒక్కడినే అయినా సరే, నా ఆశ తేజోవంతంగా వెలుగుతున్నంతకాలం సమాధిలోకూడా నేను జీవించివుంటాను. అంతేకాదు నేనా సమాధిలోంచి ఘోషిస్తూ వుంటాను.**

గాంధేయ పద్ధతులకు భారతదేశం సజీవ సమాధి కట్టిందా అని ఆనాడే కొందరు ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు గాంధీజీయే 1947 ఆగస్టు 17 'హరిజన్' పత్రికలో సమాధానం రాశారు: ఇంకా నన్ను సజీవంగా సమాధి చేయలేదనే నేను ఆశిస్తున్నాను. ప్రజానీకానికి ఇంకా నా సిద్ధాంతాలు, పద్ధతుల్లో నమ్మకం పోలేదనే విశ్వాసం నాకు ఉంది. అలా వారికి నాలో నమ్మకం పోయిందని రుజువైన రోజున వారి దారి వారిదవుతుంది. నేను సజీవంగా సమాధిచేయబడ్డానని చెప్పవచ్చు. కాని నేను ఒక్కడినే అయినా సరే, నా ఆశ తేజోవంతంగా వెలుగుతున్నంతకాలం సమాధిలోకూడా నేను జీవించివుంటాను. అంతేకాదు నేనా సమాధిలోంచి ఘోషిస్తూ వుంటాను.

అమెరికా అధ్యక్షుడు ఒబామా ఆ ఘోషను విన్నట్లున్నారు. గాంధీ వర్ధంతి సందర్భంలోనైనా మనం కూడా ఆ ఘోషను వినగలమా? మనలో ప్రతి ఒక్కరం వేసుకోవలసిన ప్రశ్న ఇది. ఆ ఘోషను విన్నప్పుడు గాంధీ గురించి, ఆయన పద్ధతుల గురించి తిరిగి చర్చిస్తాం... ప్రపంచానికి గాంధీని కానుకగానే కాదు, మార్టిన్ లూథర్ కింగ్ అనుకున్నట్లు ఆయనకు మాత్రమే కాక, మొత్తం ప్రపంచానికే నేటి సమస్యల పరిష్కారానికి గాంధీ ఆయుధం కాగలదని విశ్వసిద్దాం.

**– లవణం**
**గాంధేయ నాస్తిక విప్లవకారులు**

# ఇపుడు ఉపాధ్యాయుడేం చేయాలి?

ఇది సమాచార యుగం. ఈ సమాచార రంగంలో వచ్చిన విప్లవాలే అన్ని రంగాలను శాసిస్తున్నాయి.

ఇప్పుడు దాదాపుగా అన్నివర్గాలపై మీడియా ప్రభావమే ఎక్కువగా ఉన్నది. పారిశ్రామిక రంగంలోని ఉత్పత్తుల నుంచి అన్ని రకాల సామాజిక సమస్యలపైన మీడియా ప్రభావం బలంగా ఉంది. ఈ మీడియా రంగం నుంచి ఈ సమాచార విప్లవాల జ్ఞానదారుల నుంచి చేసే సూచనలు అన్ని రంగాలకు ఉపయోగపడతాయి. దాన్ని ప్రజానుకూల సమాచారంగా మారిస్తే అది ప్రజలకు ఎక్కువగా ఉపయోగపడుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థే అన్ని రంగాలను కూడా నిర్దేశిస్తున్నది. ముఖ్యంగా మానవ వనరులను సిద్ధం చేయటం ఆర్థికరంగం ప్రధాన లక్ష్యంగా మారింది.

స్మార్ట్ ఫోన్లు ఎంత సమాచారాన్నైనా అందించగలవు కానీ మనిషి చేసే ఆలోచనలు అవి చేయలేవు. ఆలోచించే పాఠాలు చెప్పగలగాలంటే ఉపాధ్యాయుడు అవసరం తప్పనిసరిగా ఉండి తీరాలి. ఇపుడు సమాచార విప్లవం విద్యారంగాన్ని సంపూర్ణంగా మార్చే దిశగా ముందుకు వస్తుంది. ఇది అధ్యాపన వృత్తికే ఛాలెంజ్.

ఈనాడు విద్యారంగంపైన రెండు శక్తులు బలంగా పనిచేస్తున్నాయి. ఒకటి ఆర్థిక శక్తుల్కు రెండు – మీడియా శక్తులు. ప్రతి పత్రిక కూడా విద్యారంగంపై సప్లిమెంట్ చేయటం, విద్యా పాలసీలను రూపొందించటంలో సూచనలు చేయటం విద్యా వ్యవస్థలో వున్నటువంటి సంస్థలకు ప్రచారమివ్వటం సామాజిక అవసరమైపోయింది. విద్యారంగంలో వున్న ప్రతి అంశంపైన మ్యాగజైన్‌లు వస్తున్నాయి. చివరకు తరగతి గదిలో జరిగే బోధన పైన కూడా సూచనలిచ్చేందుకు పత్రికలు ముందుకు వస్తున్నాయి. విద్యార్థులు పరీక్షలో ఏ అంశంపై ప్రిపేర్ కావాలో కూడా 24 గంటల గైడ్, వన్ డే గైడ్ అనే పుస్తకాలు కూడా మార్కెట్‌లోకి కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. పత్రికలే



కాకుండా టీవీ ఛానల్స్ తమ సాధనాలకు ఉపయోగించుకుని పాఠాలను విడుదల చేస్తున్నాయి. ఈ మధ్య ఒక సంస్థ వారు ఫిన్లాండ్, పోలెండ్, కొరియా దేశాలలో ఉపాధ్యాయుడు తరగతి గదిలో చెప్పే మ్యాథమెటిక్స్ పాఠాలను దృశ్యమానం చేశారు. పత్రికలు, మ్యాగజైన్‌లు, టీవీ ఛానల్స్ విద్యారంగాన్ని వివిధ ప్రక్రియల ద్వారా ప్రభావితం చేస్తున్నాయి. ఇవి కాకుండా మరింత కొత్త పరిణామాలు రాబోతున్నాయి. సెల్ ఫోన్‌ల ద్వారా కూడా బోధనను చూసే, వినే అవకాశం లభిస్తుంది. లెర్నింగ్ ప్రాసెస్ అంతా స్మార్ట్ ఫోన్ ద్వారా జరుగబోతుంది. తన ఇంట్లో కూర్చుని ప్రపంచంలో ఏ దేశంలో, ఏ ప్రాంతంలో ఏ విధమైన బోధన జరుగుతుందో తెలుసుకోవచ్చును. దాంతో నోట్స్ తయారుచేసుకోవచ్చును. దాన్ని ల్యాప్ టాప్‌లోకి

మార్చుకోవచ్చును. ఆ ల్యాప్‌టాప్ నుంచి ఆన్‌లైన్ ద్వారా తన చదువును ఇతరులతో షేర్ చేసుకోవచ్చును. తన అనుభవాలను మార్చుకోవచ్చును. టీచర్స్ ఫ్లాష్‌కార్డ్ ద్వారా బోధనలు చేసే అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి.

విద్యారంగంలో వచ్చే వివిధ అంశాలను ఉపయోగించుకుని ప్రపంచంలో భారీగా మార్కెటింగ్ జరుగుతుంది. ఎన్నో వెబ్‌సైట్లతో కూడా సంబంధం పెట్టుకోవచ్చును. ఉద్యోగాల కోసమై సివిల్ సర్వీసు పోటీల నుంచి క్లర్క్ పోస్టుల వరకు తర్ఫీదుల కోసం కోచింగ్ సెంటర్‌లకు పోతున్నారు. ఈ కోర్సులను కూడా వెబ్‌సైట్‌ల ద్వారా చదువుకునే అవకాశం కల్పించబోతున్నారు. దీన్నే మొబైల్ లెర్నింగ్ అంటారు. ఈ అధునాతన అధ్యయన పద్ధతితో విద్యార్థి ఉపాధ్యాయుడికి మధ్య అగాధం నెట్‌ల ద్వారా, ఇంటర్నెట్‌ల ద్వారా పూడ్చుకునే దశ వచ్చింది. విద్యార్థి ఏ ప్రదేశంలోనైనా కూర్చొని తన ఇష్టం వచ్చిన చదువును మొబైల్స్ ద్వారా చదువుకునే అవకాశం వచ్చింది. మొబైల్ లెర్నింగ్‌లో ఈ-లెర్నింగ్ విధానం రాబోతుంది. ఈ-గవర్నెన్స్ వచ్చినట్టుగానే ఈ -లెర్నింగ్ రాబోతుంది. ఈ-లెర్నింగ్ అన్నది ఇంటర్నెట్ ద్వారా విద్యా సమాచారాన్ని సంపాదించుకోవచ్చును. అది మొబైల్ లెర్నింగ్ కన్నా ఈ-లెర్నింగ్ ద్వారా ముమ్మరంగా విద్యా బోధన జరుగబోతుంది.

వీఐటీ లాంటి ప్రైవేట్ యూనివర్సిటీలు, వెబ్‌సైట్స్ ద్వారా బోధన మొదలు పెట్టాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వలన వార్తలను ఏ వెబ్‌సైట్ నుంచైనా డౌన్‌లోడ్ చేసుకుంటారు. ఈ-టెక్నాలజీ వలన దినపత్రికలు ఎలా దెబ్బతింటున్నాయో, విద్యాలయాలు కూడా అదేవిధంగా దెబ్బతినే అవకాశం ఏర్పడబోతుంది. ఇపుడు ఎవరూ ఉత్తరాలు రాయటం లేదు. అంతా నెట్‌ద్వారానే సమాచారాలు పంపుతున్నారు. ప్రతి వెబ్ సైట్ ఒక విశ్వవిద్యాలయంగా మారబోతుంది. మీడియాలో వస్తున్న ఆవిష్కరణలతో విద్యారంగం స్వరూపమే మారబోతుంది. అయితే దీనిలో ఒక లోపం ఉంది. ఉపాధ్యాయునికి విద్యార్థికి మధ్య జరిగే ప్రేరణ మాత్రం ఇందులో కనిపించదు. దీన్ని ఏ సాంకేతికమైన పరికరమూ పూర్తిచేయలేదు. ఉపాధ్యాయుడు చదువు చెప్పడంతో పాటు ప్రేరణ కలిగిస్తాడు. సమాచార ప్రకియ అనేది సెల్‌ఫోన్ల ద్వారా జరగబోతుంది. ఇవాళ చెప్పిన పాఠం రేపు కూడా అలాగే చెబుతానంటే ప్రేరణ కలుగదు.

ఒక్కొక్క ఉపాధ్యాయుడు ఒక్కొక్క తరగతిలో విభిన్న రీతిలో చదువు చెబుతాడు. ఉపాధ్యాయులు పలురకాల ప్రేరణలను కలిగిస్తారు. గతంలో ఒక పాఠ్యాంశానికి సంబంధించి నోట్స్ తయారుచేస్తే పదిపదిహేనేళ్లు అదే చెప్పేవారం. ఇప్పుడు



ఉపాధ్యాయులు ప్రతిక్షణం అధ్యయనం చేయాల్సి ఉంటుంది. రొటీన్‌గా పాఠాలను సెల్‌ఫోన్, స్మార్ట్‌ఫోన్లు సమాచారం అందచేయకలుగుతాయి. స్మార్ట్ ఫోన్లు ఎంత సమాచారాన్నైనా అందించగలవు. కానీ మనిషి చేసే ఆలోచనలు స్మార్ట్ ఫోన్‌లు చేయలేవు. ఆలోచించే పాఠాలు చెప్పగలగాలంటే ఉపాధ్యాయుడు అవసరం తప్పనిసరిగా ఉండి తీరాలి. ఇపుడు మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సమాచార విప్లవం విద్యారంగాన్ని సంపూర్ణంగా మార్చే దిశగా ముందుకు వస్తుంది. ఇది అధ్యాపన వృత్తికే ఛాలెంజ్. ఇపుడు ఉపాధ్యాయుడేం చేయాలి?

**-చుక్కా రామయ్య**

**విద్యావేత్త, శాసనమండలి మాజీ సభ్యులు**

# జలమొచ్చినా జగడమే

## అంచనాకు మించి నీటి లభ్యత ఉన్నా రెండు రాష్ట్రాల మధ్య వివాదం



ఎగువ రాష్ట్రాల నుంచి రావాల్సిన నీళ్ల కన్నా ఎక్కువగానే వచ్చినా కృష్ణా జలాలపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య జగడం తప్పలేదు. కర్ణాటక నుంచి సాధారణంగా 450 నుంచి 500 టీఎంసీలు వస్తే ఎలాంటి వివాదమూ రాకూడదు. కానీ ఈ ఏడాది శ్రీశైలంలోకి ఇప్పటిదాకా 627.68 టీఎంసీలు వచ్చినా రెండు రాష్ట్రాల మధ్య వివాదం తలెత్తి సమస్య తీవ్రరూపం దాల్చడం చర్చనీయాంశమైంది. దీనిపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు చేతులెత్తేయగా.. కేంద్రం పట్టించుకోవడం లేదు. దీంతో జోక్యం చేసుకోవాల్సిందిగా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర జలవనరులశాఖను ఆశ్రయించాయి.

కృష్ణా బేసిన్‌లో 75శాతం నీటి లభ్యత ఆధారంగా 2130 టీఎంసీలు లభిస్తాయని నిర్ధారించినపుడు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బచావత్ ట్రైబ్యునల్ 811 టీఎంసీలు కేటాయించింది. ఇందులో తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీల కేటాయింపులున్నాయి. రెండు రాష్ట్రాలకు కలిపి ఎగువన ఉన్న కర్ణాటక నుంచి రావాల్సింది 450 నుంచి 500 టీఎంసీలే. కానీ ఈసారి అంతకు మించి సుమారు 130 టీఎంసీలు అదనంగా వచ్చినా నీటి పంపిణీ సామరస్యంగా జరగలేదు. శ్రీశైలం ఎగువన తుంగభద్ర కింద హెచ్చెల్సీకి, ఎల్లెల్సీకి కేటాయింపు ఉంది. జూరాల, ఆర్డీఎస్‌కు అదే మాదిరి కేటాయింపు లున్నాయి. వేదవతి కింద ఉన్న కేటాయింపులదీ అదే పంథా.. ఇవన్నీ పోతే సుమారు 350 టీఎంసీలు శ్రీశైలానికి వస్తే, రెండు రాష్ట్రాల్లో లభించిన నీటితో కలిసి ఎలాంటి ఇబ్బందీ ఉండకూడదు.

నీటి లభ్యత మెరుగ్గా ఉన్నా వివాదం నెలకొనడానికి ప్రధాన కారణాలు, ఇద్దరి వాదనలు ఇలా ఉన్నాయి...

☞ సాగర్ ఎడమ కాలువ పరిధిలో మొదటి జోన్‌లో ఖరీఫ్ పూర్తయిన వెంటనే రబీకి నీటిని విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం బోర్డును కోరింది. అయితే నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని కృష్ణా డెల్టా కింద రబీ కేటాయింపులు, తాగునీటి అవసరాలు పోనూ రబీకి సాగర్ ఎడమ కాలువ కింద నీటి విడుదలకు అవకాశం లేదని ఆంధ్రప్రదేశ్ పేర్కొంది.

☞ బచావత్ ట్రైబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీలు కేటాయించింది. ఇందులో తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు ఉన్నాయి. ఇందులో తుంగభద్ర కింద, సాగర్ దిగువన లభ్యమయ్యే నీరు పూర్తిగా ఆంధ్రప్రదేశ్‌కే పోతుంది కాబట్టి ప్రధాన కృష్ణాలో ఉన్న నీటిని పరిగణిస్తూ ఆ నీటిని లెక్కగట్టి వినియోగించుకోవాలని తెలంగాణ ప్రతిపాదించింది. దీని ప్రకారం ప్రధాన కృష్ణాలో 480.688 టీఎంసీలు ఉన్నాయని, ఇందులో తెలంగాణకు 200.038(41.61 శాతం), ఆంధ్రకు 280.650(58.39 శాతం) కేటాయింపు ఉందని తెలంగాణ పేర్కొంది. ఇందులో తాము వినియోగించుకున్న నీరు పోను మిగిలిన భాగాన్ని సాగర్ ఎడమ కాలువ కింద రబీకి, తాగునీటి అవసరాలకు వినియోగించుకుంటామని ప్రతిపాదించింది. తెలంగాణ ప్రతిపాదన సరికాదని ఆంధ్రప్రదేశ్ పేర్కొంది. ఆంధ్రకు 73 శాతం వాటా ఉండగా, తెలంగాణకు 27 శాతం ఉందని, తెలంగాణ తన వాటాను ఇప్పటికే పూర్తిగా వినియోగించుకుందని పేర్కొంది. భూగర్భ జలాలు, చిన్ననీటి వనరులకు ఉన్న కేటాయింపులను మొత్తం నీటి కేటాయింపులో చూపించి సాగర్ కింద వాడుకోవడం కుదరదని ఆంధ్రప్రదేశ్ పేర్కొంది.



☞ కృష్ణాడెల్టాకు 181.20 టీఎంసీలు బచావత్‌కు కేటాయించగా, ఇందులో భీమాకు 20 టీఎంసీలు, పులిచింతలకు 9 టీఎంసీలు కేటాయించారు. ఇక డెల్టాకు ఉన్నది 152.20 టీఎంసీలేనని తెలంగాణ పేర్కొంది. నాగార్జునసాగర్ దిగువన లభ్యమయ్యే నీరు పూర్తిగా కృష్ణా డెల్టాకే వెళ్తుంది. సాగర్ దిగువన 108

టీఎంసీల నీరు లభ్యమవుతుందని గతంలో ఎస్సార్బీసీ సమగ్ర నివేదికలో (డిపిఆర్) పేర్కొన్నారు. ఈ నీరు పోను సాగర్ నుంచి విడుదల చేయాల్సింది 50 టీఎంసీల లోపే. కానీ ఇప్పటికే ఎక్కువగా ఉపయోగించుకుంది. ఇంకా ఖరీఫ్‌కే అవసరమని చెబుతోంది. ఇప్పుడు అవసరమైన నీటిని తీసుకుని వచ్చే ఖరీఫ్‌లో ఈ నీటిని మినహాయించుకోవాలని తెలంగాణ ప్రతిపాదించింది.

☞ దీంతో ఆంధ్రప్రదేశ్ విభేదించింది. బచావత్ ట్రైబ్యునల్ నాగార్జునసాగర్ దిగువన 18.9 టీఎంసీలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంది. ట్రైబ్యునల్ కేటాయింపులే ప్రధానం. తెలంగాణ చెబుతున్నట్లు 108 టీఎంసీల లభ్యత లేదు. కృష్ణా డెల్టా ఆధునికీకరణ ద్వారా ఆదా అయ్యే 20 టీఎంసీల నీటిని భీమాకు కేటాయించారు. ఇంత వరకు ఆధునికీకరణే జరగలేదు. కృష్ణాడెల్టా ఆధునికీకరణకు, పులిచింతలకు ఆమోదం తెలిపినపుడు ఆధునికీకరణ జరిగిన తర్వాతనే భీమాకు ఇవ్వాలని, అప్పటివరకు వేరే ప్రాజెక్టుల వినియోగం తగ్గించుకొని భీమాకు వినియోగించుకోవాలని కేంద్రం స్పష్టంగా పేర్కొంది. కాబట్టి కృష్ణాడెల్టాకు మరో 15.89 టీఎంసీలు వినియోగించుకోవడానికి అవకాశం ఉంది.

### కృష్ణానదీ యాజమాన్య బోర్డు లేదా కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ తేల్చాల్సిన అంశాలు

☞ సాగర్ దిగువన 108 టీఎంసీల నీటి లభ్యత ఉందని, మిగిలిన నీటినే సాగర్ నుంచి తీసుకోవాలన్న తెలంగాణ వాదనపై...బచావత్ కేటాయింపుల ప్రకారం ఏ ప్రాజెక్టుకు ఉన్న కేటాయింపులను ఆ ప్రాజెక్టు కిందనే వాడుకోవాలా లేక రాష్ట్రానికి ఉన్న మొత్తం కేటాయింపులను ఎక్కడైనా వినియోగించుకోవచ్చా? ఇందులో చిన్న నీటి వనరులను కూడా కలిపి వినియోగించుకోవచ్చా?

### ప్రాజెక్టులను ఆధీనంలోకి తెచ్చుకోండి: ఏపీ

శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను వెంటనే తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని, బోర్డు పరిధిపై నోటిఫికేషన్ జారీ చేయాలని కోరుతూ ఏపీ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి కేంద్రజలవనరుల మంత్రిత్వశాఖ కార్యదర్శికి లేఖ రాసినట్లు తెలిసింది. గతంలో ఇదే అంశంపై ఏపీ ఇ.ఎన్.సి కృష్ణానదీ యాజమాన్య బోర్డుకు లేఖ రాశారు. బోర్డు నిర్వహణకు సంబంధించిన ముసాయిదాపై రాష్ట్రాలు తమ అభిప్రాయాలు తెలిపి, కేంద్రం నోటిఫై చేసే వరకు తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం సాధ్యం కాదని బోర్డు బదులిచ్చింది. ఇటీవల సాగర్ కుడికాలువకు నీటి విడుదలలో ఇబ్బందులు ఎదురయ్యాయని, కృష్ణాడెల్టాకు ఏకపక్షంగా నీటిని నిలిపివేశారని, సాగర్ ప్రాజెక్టు పూర్తిగా తెలంగాణ ఆధీనంలో ఉండటం వల్ల తాము అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చినందున వెంటనే రెండు ప్రాజెక్టులను తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ కోరింది.

### సాగర్ ఎడమ కాలువ నుంచి రబీకి నీటి విడుదలపై జోక్యం చేసుకోండి: తెలంగాణ

బచావత్ ట్రైబ్యునల్ కేటాయింపుల ప్రకారం తమకున్న నీటిని వినియోగించుకోవడానికి కూడా ఏపీ అడ్డుపడుతోందని, వెంటనే జోక్యం చేసుకొని సాగర్ ఎడమ కాలువ కింద రబీ ఆయకట్టుకు నీటిని విడుదల చేసేలా నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖను కోరింది. ఈ మేరకు రెండు రోజుల క్రితం నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ కార్యదర్శికి లేఖ రాయడంతో పాటు మంత్రి హరీశ్‌రావు కూడా మంత్రిత్వశాఖ అధికారులతో మాట్లాడినట్లు తెలిసింది. ప్రధాన కృష్ణాలో ఎవరి వాటా ఎంతో మేం బోర్డుకు చెప్పాం, ఆ వివరాలతో విభేదిస్తే ఏ రాష్ట్రానికి ఉన్న వాటా ఎంతో మీరే తేల్చండి, ఈ విషయంలో జాప్యం చేయవద్దు, ఇప్పటికే రబీకి నీటి విడుదలలో జాప్యం జరిగి రైతులు ఆందోళనతో ఉన్నారని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. నీటి కేటాయింపులు, వినియోగం వివరాలనూ కేంద్రానికి పంపారు. రెండు రాష్ట్రాల అధికారులతో ఢిల్లీలో సమావేశం ఏర్పాటు లేదా జలవనరుల మంత్రిత్వశాఖకు చెందిన సీనియర్ అధికారిని పంపుతామని కేంద్రం చెప్తున్నా, ఇది ఎప్పుడు జరుగుతుందో తెలియడం లేదని రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి.

# ఇక్కడా తలోదారి!

## కృష్ణా బోర్డు మార్గదర్శకాలపై భిన్నంగా స్పందించిన తెలుగు రాష్ట్రాలు

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు తయారుచేసిన మార్గ దర్శకాలపై తెలుగు రాష్ట్రాలు రెండూ పరస్పర భిన్నంగా తమ అభిప్రాయాలు వ్యక్తంచేశాయి. బోర్డు నిర్ణయాలపై ఏ రాష్ట్రానికైనా అభ్యంతరం ఉంటే కేంద్ర జలవనరుల మంత్రి ఛైర్మన్‌గా గల అత్యున్నత మండలి (అపెక్స్ కౌన్సిల్)కి అప్పీలు చేసుకునే అవకాశం ఉండాలని తెలంగాణ కోరింది. ఆంధ్రప్రదేశ్ మాత్రం బోర్డు నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందేనన్న నిబంధనకు అంగీకరించింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం మేరకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, అపెక్స్ కౌన్సిల్ ఏర్పడ్డ విషయం తెలిసిందే. బోర్డుకు ఛైర్మన్, సభ్య కార్యదర్శి నియమితులై సాంకేతికంగా కార్యక్రమాలు ప్రారంభించినా, బోర్డు పరిధి, అధికారాలు, విధివిధానాలను కేం ద్రం నోటిఫై చేయాల్సి ఉంది. వీటన్నిటిపైనా బోర్డు ఇటీవల ఓ ముసాయిదాను తయారు చేసి రెండు రాష్ట్రాలకు పంపి అభిప్రాయాలను కోరింది. దీనికి సమాధానం ఇవ్వడంలో రెండు రాష్ట్రాలు తీవ్రంగా జాప్యం చేశాయి. కేంద్రం నోటిఫై చేయకుండా ప్రాజెక్టులను తమ ఆధీనంలోకి తెచ్చుకుని నిర్ణయాలు తీసుకోవడం సాధ్యం కాదని, ఇది జరగాలంటే ముసాయిదాపై అభిప్రాయాలు చెప్పాలని బోర్డు ఛైర్మన్, సభ్య కార్యదర్శి పలుసార్లు సూచించారు. ఈ నేపథ్యంలో ఏపీ, తెలంగాణ తమ అభిప్రాయాలను తాజాగా తెలియజేశాయి.

**సెక్షన్ 87 ప్రకారం బోర్డు పరిధి**

నీటి విడుదల, ప్రాజెక్టుల నిర్వహణ, యాజమాన్యం తదితర అంశాలపై బోర్డుది నిర్ణయం కాగా, కొత్త ప్రాజెక్టుల నిర్మాణానికి సంధించిన ప్రతిపాదనలు, విధానపరమైన నిర్ణ యాలు అపెక్స్ కౌన్సిల్ తీసుకుంటుంది. అయితే బోర్డుకున్న అధికారాల మేరకు అది తీసుకునే నిర్ణయాలకు రెండు రాష్ట్రాలు కట్టుబడి ఉండాలన్న నిబంధనను తెలంగాణ వ్యతిరేకించింది. అత్యున్నత మండలికి (అపెక్స్ కౌన్సిల్‌కు) నెల రోజుల్లోగా అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండాలని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ మాత్రం బోర్డు ప్రతిపాదనతో అంగీ కరించింది. బోర్డు పరిధి ఏంటన్నదానిపై మాత్రం రెండు రాష్ట్రాలు దాదాపు ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయి. బోర్డు పరిధి పునర్విభజన చట్టంలోని సెక్షన్ 87 ప్రకారం ఉండా లని, రెండు రాష్ట్రాలకు నీటిని సరఫరా చేసే రెగ్యులేటర్లున్న ప్రాజెక్టులను చేర్చాలని కోరాయి. ఒక రాష్ట్రం నీటి విని యోగం, ఇంకో రాష్ట్రం విద్యుత్తు వినియోగం ఉన్న ప్రాజెక్టులను, ఒక రాష్ట్రం నీటిని వినియోగించుకోవడం వల్ల ఇంకో రాష్ట్రానికి ఉన్న కేటాయింపులపై ప్రభావం చూపే ప్రాజెక్టులను ఇందులో చేర్చాలని కోరాయి. విద్యుత్తును ఉత్పత్తి చేసి రెండు రాష్ట్రాలు వినియోగించుకునే ప్రాజెక్టు లను కూడా చేర్చాలని తెలంగాణ అదనంగా కోరింది. రెండు రాష్ట్రాలు అంగీకరించే ప్రాజెక్టులను చేర్చవచ్చని రెండు రాష్ట్రాలూ అంగీకరించాయి. నేరుగా బోర్డు నియంత్రణలో లేకుండా రాష్ట్ర ప్రభుత్వాలే నిర్వహిస్తున్న ప్రాజెక్టులకు సంబంధించిన పర్యవేక్షణ, నీటి వివరాలు బోర్డు పరిధిలోనే ఉండాలని రెండు రాష్ట్రాలు పేర్కొన్నాయి.

సూచనలపై చర్చించనున్న బోర్డు: బోర్డు సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను ఛైర్మన్ ఆమోదించగానే కార్యదర్శి సభ్యులకు పంపాలని, ఈ నిర్ణయాలు వెంటనే అమలు జరగాలని, ఆంధ్రప్రదేశ్ పేర్కొనగా, తెలంగాణ మాత్రం దీంతో విభేదించింది. ఒక బోర్డు సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను నిర్ధారించేందుకు తదుపరి బోర్డు సమావేశంలో పెట్టాలని పేర్కొంది. బోర్డు పనికి సంబంధించి కూడా తెలంగాణ ప్రభుత్వం అదనపు సూచనలు చేసింది. నిర్వహణకు అయ్యే మొత్తాన్ని చెరి సగం భరించాలని బోర్డు ప్రతిపాదించగా, నీటి కేటాయింపుల వాటాను బట్టి బడ్జెట్ ఉండాలని తెలంగాణ సూచించింది. రెండు రాష్ట్రాలు చేసిన సూచనలపై బోర్డు చర్చించి తుది నిర్ణయం తీసుకుంది. కేంద్రం నోటిఫై చేసిన తర్వాత ఇందులో పేర్కొన్న ప్రాజెక్టులన్నీ బోర్డు నియంత్రణలోకి వెళ్తాయి.

# ఉన్నత విద్యకు కొత్త ప్రణాళిక!

## రూసా అనుమతి సాధించేలా... తెలంగాణ అధికారుల కసరత్తు

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యకు కొత్త ప్రణాళిక (షెప్) తయారీ వేగవంతమైంది. రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) కింద అనుమతులు సాధించేలా తెలంగాణ ఉన్నత విద్యాశాఖ కసరత్తును వేగిరం చేసింది. గత ప్రతిపాదనల్ని పునఃపరిశీలించి... భవిష్యత్ అవసరాలతోపాటు, కేంద్ర ప్రణాళికలను దృష్టిలో ఉంచుకొని సరికొత్తగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వచ్చేనెల తొలివారంలో రూసా ప్రాజెక్టు అనుమతుల మండలి (పీఏబీ) సమావేశం జరిగే అవకాశం ఉండటంతో... విద్యాశాఖ కొత్త ముఖ్యకార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య... కళాశాల, సాంకేతిక విద్యాశాఖ సంచాల కులుగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారిణి వాణీప్రసాద్ దీనిపై వేగంగా చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే అధికారులు సిద్ధం చేసిన వార్షిక ప్రణాళికను సమీక్షిస్తున్నారు. రూసా నిధులకు అత్యంత కీలకమైన స్టేట్ ప్రాజెక్టు డైరెక్టరేట్ రూపకల్పనకు సంబంధించి ఆదేశాలు జారీ చేశారు. కళాశాల విద్య సంచా లకులకు ఎస్పీడీ బాధ్యతలు అప్పగించారు. అంటే తాజా ఆదేశాల ప్రకారం... వాణీప్రసాద్ ఎస్పీడీగా వ్యవహరిస్తారు. నిధుల రాకకు రాష్ట్రస్థాయిలో ఎస్పీడీ (స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్), నోడల్ అధికారుల్ని నియమించటం తప్పనిసరి. వీరిద్దరి ఉమ్మడి ఖాతాకే డబ్బులు జమవుతాయి. ఇక నోడల్ అధికారిగా ఎవర్నినియమిస్తారనేదే ఆసక్తికరంగా ఉంది.



కేంద్రం మార్గదర్శకాలకు అనుగుణంగా: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండు రాష్ట్రాలకూ కలిపి ప్రతిపాదనల్ని రూసాకు సమర్పించారు. రాష్ట్రం విడిపోవటంతో... విడివిడిగా ఇవ్వాలని కేంద్రం కోరింది. ఈ నేపథ్యంలో... కొత్తగా మళ్లీ సవరించిన ప్రతిపాదనల్ని రాష్ట్రం సమర్పిస్తోంది. ఐదేళ్లలో 1300 కోట్ల రూపాయల మేర ప్రతిపాదనల్ని తెలంగాణ తరపున ఇదివరకే తయారు చేశారు. వచ్చేనెల జరిగే పీఏబీ సమావేశంలో ప్రతిపాదనల్ని సమర్థంగా వివరించగలిగితే... తొలివిడతగా నిధుల్ని కేంద్రం రూసా కింద మంజూరు చేస్తుంది. రూసా కింద కొత్తగా మూడు విశ్వవిద్యాలయాలకు అధికారులు గతంలో ప్రతిపాదనలు పంపారు. ఆదిలాబాద్, సిద్దిపేట (డిగ్రీ) కొత్తగూడెం (ఇంజినీరింగ్) కళాశాలల్ని విశ్వవిద్యాలయాల స్థాయికి పెంచాలని, వీటితోపాటు మరో రెండు క్లస్టర్ (కొన్ని కాలేజీలు కలిపి) వర్సిటీలకు ప్రతిపాదించారు. స్వయం ప్రతిపత్తిగల కళాశాలలకు మాత్రమే విశ్వవిద్యాలయాల హోదా ఇస్తామంటూ రూసా అధికారులు మెలిక పెడుతున్న నేపథ్యంలో ఏం చేయాలో అధికారులు ఆలోచిస్తున్నారు.

నియమాకాలన్నీ రద్దు!: తెలంగాణ ఆవిర్భావ తేదీ (జూన్ 2, 2014) తర్వాత విశ్వవిద్యాయాల్లో జరిగిన అన్ని కాంట్రాక్టు నియామకాల్ని రద్దు చేయాలని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు అన్ని విశ్వవిద్యాలయాలకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. కాంట్రాక్టు ఉద్యోగుల్ని క్రమబద్ధీకరించాలని నిర్ణయించిన నేపథ్యంలో చాలాచోట్ల హడావుడిగా జూన్2 తర్వాత నియామకాలు చేపట్టినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది.

# భావస్వేచ్ఛకు ముప్పు

భారత్ ఒక అర్ధ ప్రజాస్వామ్యదేశం మాత్రమేనని నేను చాలా కాలంగా చెబుతున్నాను. స్వేచ్ఛాయుత ఎన్నికలు, ప్రజల స్వేచ్ఛాయుత కదలికలు... ఇత్యాది అంశాల్లో ప్రపంచంలోని మరే ఇతర దేశం మాదిరిగానే మనదీ ప్రజాస్వామ్యమే. ఇతర అంశాలలో మనం బాగా వెనుకబడి పోయి వున్నాము. ఇది అందరికీ స్పష్టమే. మనం బాగా వెనుకబడి వున్న అంశాలలో భావవ్యక్తీకరణ స్వేచ్ఛఒకటి. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు మొదటి ముప్పు వలసపాలనా కాలపు శాసనాలను మనం ఇంకా యథాతథంగా అనుసరించడం. వెండీ డోనిగర్ పుస్తకం 'ది హిందూస్: ఏన్ ఆల్టర్‌నేటివ్ హిస్టరీ'ని నిషేధించాలని న్యాయస్థానాన్ని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కార్యకర్త దీనానాథ్‌బాత్రా అభ్యర్థించారు. భారతీయ శిక్షాస్మృతిలోని ఆరు నిర్దిష్ట సెక్షన్లకింద ఆ గ్రంథాన్ని నిషేధించొచ్చని ఆయనపేర్కొన్నారు.



భారతీయ శిక్షా స్మృతికర్త థామస్ బాబింగ్టన్ మెకాలే. ఆరెస్సెస్ ఆయన్ని బాహాటంగా నిరసిస్తుంది. బ్రిటిష్ పాలన వల్ల భారతీయ సంస్కృతి కలుషితమయి పోయిందని కూడా విమర్శించడం ఆ సంస్థకు పరిపాటి. అయినప్పటికీ తన లక్ష్యాలకు ఉపయోగ పడినప్పుడు మెకాలే రూపొందించిన చట్టాలను ఆరెస్సెస్ సంపూర్ణంగా అంగీకరిస్తుంది. స్వాతంత్ర్యానంతర ప్రభుత్వాలు, ప్రజాస్వామ్య పాలనకు దోహదం చేయని వలసపాలకుల చట్టాలను రద్దుచేయకపోవడంవల్లే ఆరెస్సెస్ తనకు అవసరమైనప్పుడు ఆ శాసనాలను ఉపయోగించుకోగలుగుతంది. పుస్తకాలు, సినిమాలను నిషేధించడానికి భారతీయ శిక్షా స్మృతేకాక నేర విచారణా స్మృతి కూడా అనుమతిస్తుంది. రాజ్యవ్యవస్థ కూడా పుస్తకాలను నిషేధించే లేదా జప్తుచేసే అధికారాలు కలిగివుంది.

భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు రెండో ముప్పు మన న్యాయవ్యవస్థలోని లోపాలు. వలస పాలకుల చట్టాల ప్రాతిపదికన పుస్తకాలు, పెయింటింగ్‌లు, సినిమాలను నిషేధించాలని కోరుతూ దాఖలవుతున్న పిటీషన్లపై విచారణకు క్రిందిస్థాయి న్యాయస్థానాలు, సబార్డినేట్ జడ్జీలు చాలా ఉత్సాహం చూపుతున్నారు. సదరు పిటీషన్‌లపై ఏ న్యాయస్థానంలో ఏ న్యాయమూర్తి నుంచి అనుకూల తీర్పు వస్తుం దో వాటిని దాఖలుచేసే వారికి బాగా తెలుసు.

ఢిల్లీ నుంచి ప్రచురితమయ్యే 'కారవాన్' మ్యాగజైన్‌కు వ్యతిరేకంగా దాఖలైన ఒక పిటీషన్‌ను ఎక్కడో దూరానఉన్న సిల్చార్ పట్టణంలోని ఒక న్యాయమూర్తి విచారణకు స్వీకరించారు. దీనానాథ్ బాత్ర సైతం దేరాబస్సీ అనే పట్టణంలోని న్యాయ స్థానంలోనే తన పిటీషన్లను దాఖలు చేస్తుంటారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను పరిరక్షించడంలో హైకోర్టులు, సుప్రీం కోర్టు చాలా చురుగ్గా క్రియాశీలంగా వ్యవహరిస్తున్న మాట నిజమే. అయితే ఒక పుస్తకం లేదా పెయింటింగ్‌ను క్రింది న్యాయస్థానం నిషేధించిన తరువాత ఉన్నత న్యాయ స్థానం ఆ తీర్పును కొట్టివేయడానికి కొన్ని ఏళ్ళు పడుతుంది. సుదీర్ఘంగా జరిగే ఈ న్యాయపోరాటాలను ఎదుర్కొనే ఓపిక, ధైర్యం, ఆర్థికశక్తి చాలా తక్కువ మంది ప్రచురణకర్తలు, రచయితలు, కళాకారులకు మాత్రమే ఉంటుంది.

భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు మూడో ముప్పు పోలీసుల ప్రవర్తన నుంచి వాటిల్లుతోంది. న్యాయస్థానాలు రచయితలు, కళాకారుల పక్షాన ఉన్నప్పుడు కూడా పోలీసులు గూం డాలు, సంకుచిత శక్తుల పక్షం వహిస్తున్నారు. ఛత్రపతి శివాజీ గురించి జేమ్స్ లయినే పుస్తకంపై నిషేధాన్ని హైకోర్టు రద్దుచేసిన తరువాత కూడా ప్రచురణ కర్తలు నిస్సహాయంగా

ఉండిపోయారు. ఆ పుస్తకప్రతులను విక్రయించిన పక్షంలో శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు తమపై దాడిచేస్తారన్న విషయం వారికి బాగా తెలుసు. అందుకే ఆ పుస్తకాన్ని పంపిణీ చేయడానికి వారు చాలా భయపడిపోయారు.

అహ్మదాబాద్‌లో ఒక మతసామరస్య కేంద్రంపై భజరంగ్‌దళ్ కార్యకర్తలు దాడిచేసినప్పుడు పోలీసులు చూస్తూ వుండిపోయారు. నా స్వరాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో 1988లో యువ పాత్రికేయుడు ఉమేష్ దోభాల్‌ను లిక్కర్ మాఫియా హత్యచేసింది. తనకు ప్రాణ భయం ఉందని దోభాల్ ఫిర్యాదు చేసినప్పుడు పోలీసులు ఉదాసీనంగా ఉండిపోయారు. హ త్య జరిగిన తరువాత హంతకులు ఎవరో తెలిసినప్పటికీ వారిని అరెస్ట్ చేయడానికి ప్రయత్నించలేదు. ఇటీవల ఉత్తరాఖండ్‌కే చెందిన హేమ్‌పాండే అనే పాత్రికేయుడిని ఒక బూటకపు ఎన్‌కౌంటర్‌లో పోలీసులు కాల్చిచంపారు.

భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు నాలుగో ముప్పు రాజకీయవేత్తల పిరికితనం. ఏ ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రి కూడా భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను గట్టిగా సమర్థిస్తూ మాట్లాడనేలేదు. చాలామంది ముఖ్యమంత్రులు, కొద్దిమంది ప్రధాన మంత్రులు వాస్తవానికి పుస్తకాలు, పెయింటింగ్‌లను నిషేధించాలనే సంకుచిత వాదుల పక్షమే వహించారు. రష్దీ నవల 'ది సాటానిక్ వెర్సెస్'పై నిషేధానికి కాంగ్రెస్ నాయకుడు రాజీవ్ గాంధీ బాధ్యుడు. పశ్చిమ బెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం తస్లీమా నస్రీన్ నవలలపై నిషేధం విధించింది. ఆ తరువాత ఆమె తమ రాష్ట్రంలో నివశించకూడదని ఆంక్షలు విధించింది. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పలు పుస్తకాలు, సినిమాలు, పెయింటింగ్‌ల ప్రదర్శనలు నిషేధానికి గురయ్యాయి. తాజాగా తమిళ రచయిత పెరుమాళ్ మురుగన్ అసలు సాహితీ వ్యాసంగం నుంచే నిష్క్రమించేలా చేయడంలో సంకుచిత శక్తులు సఫలమయ్యాయి. తమిళనాడులోని ఏ ప్రధాన రాజకీయపక్షమూ మురుగన్‌కు మద్దతునివ్వడం లేదు. చాలా విషాదకరమైన పరిణామమిది.

మీడియా సంస్థలు తమ ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం ఇచ్చే వాణిజ్య ప్రకటనలపై ఆధారపడి వుండడం భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు ఎదురవుతున్న ఐదో ముప్పు. ప్రాంతీయ భాషా పత్రికల విషయంలో ఇదొక కఠోర వాస్తవం. రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాల నుంచి ప్రచురితమయ్యే దినపత్రికలు, మ్యాగజైన్లు తరచు రాష్ట్ర ప్రభుత్వ ఉదారతపై ఆధారపడి మనుగడ సాగిస్తుంటాయి. దీంతో అవి అధికార పార్టీ నాయకుల అవినీతి బాగోతాలను బహిర్గతపరచడానికి సాహసించవు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు ఆరో ముప్పు మీడియా వాణిజ్య ప్రకటనలపై ఆధారపడి వుండడం. సంపన్న మధ్యతరగతి ప్రజలు పాఠకులు, వీక్షకులుగా ఉన్న ఆంగ్ల దినపత్రికలు, మ్యాగజైన్లు, టీవీ ఛానెల్స్ కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకంగా రాయడానికి సాహసించవు. ఆ సంస్థల అక్రమాలను బయటపెట్టడం జరిగితే అవి తమ ఆదాయాన్ని కోల్పోవడం ఖాయం.

భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు ఏడో ముప్పు సైద్ధాంతిక నిబద్ధత గల రచయితలు. రచయితలు ఒక రాజకీయపార్టీకి విధేయులుగా ఉండకూడదని జార్జి ఆర్వెల్ అంటాడు. ఒక భావజాలాన్ని విశ్వసించే రచయిత సత్యాన్ని చెప్పలేడని ఆయన అభిప్రాయపడ్డారు. మన దేశంలో చాలా మంది రచయితలు, పాత్రికేయులు ఒక నిర్దిష్ట రాజకీయపక్షానికి విదేయులుగా ఉండడం కద్దు. వారు ఆ పార్టీ ఎజెండాను ప్రజల్లోకి తీసుకువెళ్ళడానికే ప్రాధాన్యమిస్తారు. భారతీయ జనతాపార్టీకి ప్రచారకర్తలుగా ఉన్న రచయితలు, కాంగ్రెసకు అధికార ప్రతినిధులుగా ఉన్న రచయితలు, సీపీఎం తప్పిదాలకు సంజాయిషీ ఇస్తున్న రచయితలు, నక్సలైట్లకు మద్దతునిస్తున్న రచయితలు చాలా మంది ఉన్నారు.


భావ వ్యక్తీరణ స్వేచ్ఛకు సంభవిస్తున్న ఈ ఏడు ముప్పులూ భారత ప్రజాస్వామ్య నైతిక, వ్యవస్థాగత పునాదులను శిథిలం చేస్తున్నాయి. మన రచయితలు, కళాకారులు అర్ధ నియంతృత్వ దేశాలైన చైనా, రష్యాలలోని రచయితలు, కళాకారుల కంటే ఎక్కువ స్వేచ్ఛను కలిగివున్నారు. అయితే స్వీడన్, కెనడా మొదలైన ప్రజాస్వామ్యదేశాలలోని రచయితలు, కళాకారులతో పోలిస్తే మన రచయితలు, కళాకారులు అంత స్వేచ్ఛగా లేరు.

**–రామచంద్ర గుహ**

# రంగు మార్చని నాయకుడు

మూడు దశాబ్దాల క్రితం నాటి మాట. శాసనసభకు కొత్తగా ఎన్నికైన ఇద్దరు యువ నాయకులని తీసుకుని పాలడుగు వెంకట్రావు న్యూఢిల్లీలోని మా ఇంటికి వచ్చారు. 'మేం ముగ్గురం కలిసి పని చేస్తాం, మీ సలహాలు మాకు కావాలని' పాలడుగు కోరారు. వారు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, నారా చంద్రబాబు నాయుడు. పార్టీలో ఎన్ని కష్టాలొచ్చినా, పదవులు రాకపోయినా పార్టీ వదలాలి అనే ఆలోచనే పాలడుగు చేయలేదు. కాంగ్రెస్‌లోనే వుండి పోరాడారు.

నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని ఒకే ఒక్కడుగా పోరాడిన పాలడుగు వెంకట్రావు ఇక లేరు. ప్రస్తుత రాజకీయాలు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఒక దురంధరుడిని కోల్పోయింది. కాకాని వెంకటరత్నం శిష్యుడుగా రాజకీయాల్లోకి వచ్చి, పి.వి.నరసింహారావు అనుచరుడిగా ఒక ప్రత్యేకతను పాలడుగు సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో తెచ్చుకున్నారు. పదవి ఉన్నా, లేకున్నా ఒకే విధంగా జీవించి ప్రజల కోసం పోరాడిన నాయకుడు పాలడుగు వెంకట్రావు. రాష్ట్ర అసెంబ్లీలోను, కౌన్సిల్‌లోనూ తన వాదనలతో ఉగ్రరూతలూగించి పాలడుగుగా పేరు తెచ్చుకున్నారు. బహుశా, దేశ ఆర్థిక వ్యవస్థ, రాజకీయాల్లో జరిగిన సంస్కరణలు, వాటితో వచ్చిన పెను మార్పులు, సంబంధిత పరిణామాలకు కారణమైన ప్రభుత్వాన్ని అర్థం చేసు కొని, ఆ వ్యవహారాల గురించి కూలంకషంగా చర్చించగల నాయకులలో పాలడుగుది ఒక ప్రత్యేకత. అట్లాగే సిద్ధాంతాల ప్రాముఖ్యత, సామాన్య ప్రజానీకానికి వివరించగల నాయకుడు పాలడుగు. బహుశా ప్రస్తుత రాజకీయాల్లో అరుదైన నేత అని పాలడుగు గురించి చెప్పవచ్చు. జిల్లా రాజకీయాల్లోంచి రాష్ట్ర రాజకీయాల్లోకి స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగిన నాయకుడు పాలడుగు.



విద్యార్థి నాయకుడుగా, యువజన నేతగా, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడిగా రాష్ట్రం మొత్తం మీద తనకంటూ ఒక ప్రత్యేకతను ఆయన సముపార్జించుకున్నారు. సామాన్య ప్రజల, మరీముఖ్యంగా పేద ప్రజల అభివృద్ధి హక్కుల కోసం ఆయన పోరాడారు. రైతు కుటుంబంలో జన్మించి అందరివాడుగా పైకొచ్చి పార్టీలకతీతంగా ఆలోచించి పార్టీకి ఆదర్శంగా నిలిచారు. రాజకీయాల్లో విలువల కోసం కృషి చేశారు పాలడుగు. సామాన్య ప్రజల భవిష్యత్తు, దేశం దశ-దిశ గురించి గత పది సంవత్సరాలుగా కొంత ఆతృత, ఆరుర్దాని ఆయన ఎక్కువగా వ్యక్తపరిచారు. ముఖ్యంగా కాంగ్రెస్ రాజకీయాల పట్ల ఎంతో అసంతృప్తి వ్యక్తపరచి, పార్టీ మూలాల్లో మార్పుల కోసం పాలడుగు తన శాయకశక్తులా కృషి చేశారు.

'మాయమైపోతున్నడన్నా మనిషన్న వాడు' అని

మొదలయ్యే ఆర్.నారాయణమూర్తి సినిమా పాట పాలడుగుకు ఎంతో ఇష్టం. ఆయన సెల్‌ఫోన్‌లో వచ్చే ఈ పాట విలువలకు ఆయన ఎంత ప్రాధాన్యం ఇచ్చే వారో తెలియచెబుతుంది. పాలడుగు చివరగా రాసిన పుస్తకం పేరు 'నాటి త్యాగం.. నేటి స్థానం.. రేపటి..?'. ఆ పుస్తకంలో ఆయన ముందు మాటగా మొదటి పేరాలో విలువలని గురించి ప్రస్తావిస్తూ 'త్యాగం చేయని బ్రతుకు వృధా' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పుస్తకంలో రాష్ట్రాన్ని ప్రభావితం చేసిన నాయకులు, వారి విశిష్టత గురించి చాలా బాగా రాశారు. చదివిన వాళ్ళకి రాజకీయ నాయకులు, రాజకీయాలంటే కొత్త దృక్పథం ఏర్పడుతుంది. ఈ పుస్తకం రాజకీయ పార్టీలకి, ప్రాంతాలకు అతీతంగా రాశారు.

ఈ నెల 9న విజయవాడ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరిగింది. అంతకు ముందే ఏ గ్రంథావిష్కరణకు రానంత మంది ప్రజలు పాలడుగు పుస్తకావిష్కరణ సభకు వచ్చారు. రాష్ట్రం నలుమూలల నుంచీ ఎంతో మంది పాలగుడు పుస్తకావిష్కరణ సభకు వచ్చారు. ఆ పుస్తకాన్ని గురించిన నలుగురికి తెలియజెప్పాలనే కోరిక ఆయనకు బలీయంగా ఉన్నది.. కనుకనే హైదరాబాద్ నుంచి అంబులెన్స్‌లో వెళ్ళి ఉధృతమైన ఉపన్యాసం ఆ సందర్భంగా పాలడుగు వారు చేశారు. అదే ఆయన ఆఖరి కార్యక్రమం. తన రాజకీయాలకు ఒక జిల్లా కలెక్టర్‌గా తోడ్పడిన కె.ఆర్.వేణుగోపాల్ గారిచే ఆ పుస్తకాన్ని ఆవిష్కరింపచేయాలన్న తన ఆఖరి కోర్కెను పాలడుగు వారు నెరవేర్చుకున్నారు. అంతకు ముందు రెండు పుస్తకాలు రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆవిష్కరించారు. పుస్తకాలు కొని చదవడమే గాక, రచనలు చేసేవారు. దినపత్రికలకు ఎన్నో వ్యాసాలు రాసేవారు. తనకంటూ ఒక శైలి ఉందని నిరూపించుకున్నారు. ఈ మధ్య కాలపు రాజకీయాలలో పాలడుగు లాంటివారు ఒకరిద్దరు మాత్రమే ఉన్నారేమో! మూడు దశాబ్దాల క్రితంనాటి మాట. శాసనసభకు కొత్తగా ఎన్నికైన ఇద్దరు యువనాయకులని తీసుకుని పాలడుగు వెంకట్రావు న్యూఢిల్లీలోని మా ఇంటికి వచ్చారు. 'మేం ముగ్గురం కలిసి పనిచేస్తాం, మీ సలహాలు మాకు కావాలని' పాలడుగు కోరారు. ఆ తరువాత ఆ ఇద్దరు ఎవ్వరికి వారు ఢిల్లీ వచ్చి వాళ్ళవాళ్ళ భవిష్యత్తుని గురించి నన్ను కూడా కలుస్తూ వుండేవారు. ఆ ఇరువురికీ ఢిల్లీ పెద్దలను నా ద్వారా పాలడుగు వారే మొట్ట మొదట పరిచయం చేశారు. ఆ ఇద్దరు మరెవ్వరో కాదు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, నారా చంద్రబాబు నాయుడు. పాలడుగు వాళ్లతో పాటు పరిగెత్తలేకపోయారనేది అందరికీ తెలిసిందే.

**ఈ మధ్య కాలపు రాజకీయాలలో పాలడుగు లాంటివారు ఒకరిద్దరు మాత్రమే ఉన్నారేమో! మూడు దశాబ్దాల క్రితంనాటి మాట. శాసనసభకు కొత్తగా ఎన్నికైన ఇద్దరు యువనాయకులని తీసుకుని పాలడుగు వెంకట్రావు న్యూఢిల్లీలోని మా ఇంటికి వచ్చారు.**

పార్టీలో ఎన్ని కష్టాలొచ్చినా, పదవులు రాకపోరునా పార్టీ వదలాలి అనే ఆలోచనే పాలడుగు చేయలేదు. కాంగ్రెస్‌లోనే వుండి పోరాడారు. విధానాల విషయంలో విభేదించారు కానీ వ్యక్తులకు వ్యతిరేకం కాదు. రాజకీయాల్లో వైరుధ్యాలను వివరించే ప్రయత్నం చేశారు. కానీ విభేదాలను పెంచి పోషించే నాయకుడిగా ప్రవర్తించలేదు. జనవరి 9న పుస్తకావిష్కరణ సందర్భంగా పాలడుగు చివరగా చేసిన ఉపన్యాసం ఆయన ఆలోచనా విధానానికి ఒక పరాకాష్ట. సామాన్య ప్రజలకు అర్థమయ్యే విధంగా రాజకీయాల్లో సిద్ధాంతాల ప్రాముఖ్యం గురించి విడమర్చి వివరించారు. పాలడుగు వెంకట్రావు విద్యార్థి నాయకుడిగా ఎదుగుతున్నప్పటి నుంచి నాకు తెలుసు. ఒక మిత్రుడిని కోల్పోయాను. ఆయన చివరి పుస్తకానికి 'ఈ తరాన్ని ఆలోచింపజేసే పుస్తకం' అనే ఉపోద్ఘాతం రాసినందుకు చాలా సంతోషించాను.

**– డాక్టర్ నాగులపల్లి భాస్కరరావు**

## ఒబామా, మోదీల మధ్య వెల్లివిరిసిన స్నేహబంధం

# మైత్రీ గీతం



వాళ్లిద్దరూ ప్రభుత్వాధినేతలా? చిన్ననాటి స్నేహితులా? అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీల హావభావాలు, ఒకరితోఒకరు వ్యవహరిస్తున్న తీరు ఈ సందేహానికి తావిస్తోంది. ఆత్మీయ నేస్తాల్లా ఆదివారం అందరి దృష్టినీ ఆకర్షించిన వీరిద్దరూ.. సోమవారమూ మైత్రీబంధాన్ని అదే రీతిలో చాటుకున్నారు. తమ వ్యక్తిగత స్నేహాన్నే పునాదిగా చేసుకొని.. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని తారాపథానికి తీసుకెళతామన్న భరోసాను నింపారు. ఆదివారం అమెరికా నుంచి వచ్చిన ఒబామా కోసం అధికార లాంఛన పరదాలను చీల్చుకుంటూ విమానాశ్రయంలో మోదీ ఎదురేగి స్వాగతం చెప్పడం.. ఆత్మీయంగా ఆలింగనం చేసుకొని తోడ్కొని రావడం.. ద్వైపాక్షిక భేటీ కోసం హైదరాబాద్ హౌస్‌కు వెళ్లినప్పుడు అక్కడి పచ్చిక బయళ్లలో అన్నీ మరచిపోయి ఆప్త మిత్రుల్లా కలయతిరుగుతూ హృదయాంతరాళాల్లోని భావాలను పరస్పరం ఆవిష్కరించుకోవడం.. ప్రధాన మంత్రి దర్పాన్ని పక్కనపెట్టేసిన మోదీ ఆత్మీయ అతిథికి స్వయంగా టీ పోయడం.. ఒబామా కూడా అగ్రరాజ్యాధినేతనన్న భావనను విస్మరించి భారత ప్రధానితో అత్యంత సన్నిహితంగా మెలగడం.. మోదీ మార్క్ కార్యక్రమం 'చాయ్ పే చర్చ'ను విలేఖర్ల సమావేశంలో ప్రస్తావించడం వ్యక్తిగతంగా వారి మధ్య పల్లవించిన స్నేహానికి మచ్చుతునకల్లా నిలిచాయి. మోదీ మూడుసార్లు "బరాక్" అని సంబోధించడం, ఒబాబా కూడా 'మోదీ' అని పిలవడం ఇద్దరి మధ్య సాన్నిహిత్యాన్ని ప్రతిబింబించింది.

గణతంత్ర దినోత్సవ కవాతులోనూ ఒబామా మోదీల మైత్రి కొట్టొచ్చినట్లు కనిపించింది. ఉదయం 9.56గంటలకు రాజ్‌పథ్ వద్ద మోదీ.. ఒబామాకు స్వాగతం పలికారు. కరచాలనం చేయడమే కాకుండా.. కుడిచేత్తో ఆప్యాయంగా దగ్గరగా తీసుకున్నారు. ఇద్దరు నేతలు చిరునవ్వులు చిందిస్తూ.. అభివాదం చేసినప్పుడు ప్రజల కరతాళధ్వనులతో రాజ్‌పథ్ మార్మోగింది.

- కవాతు జరుగుతున్నప్పుడు మోదీ, ఒబామాలు నవ్వుతూ ముచ్చటించడం కనిపించింది. మోదీతో మాట్లాడేందుకు ఒబామా.. పదేపదే కుడివైపునకు చేరబడటం కూడా అందరి దృష్టినీ ఆకర్షించింది.
- ఆకర్షణీయమైన శకటాలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలను చూసినప్పుడల్లా ఇద్దరు నేతలు ముఖాలపై చిరునవ్వులు విరబూశాయి.

# పౌర అణు విద్యుత్‌పై నిర్ణయం కంపెనీలదే

## ఒబామా భారత్ పర్యటనతో కీలకాంశాల్లో పురోగతి



అధ్యక్షుడు ఒబామా భారత పర్యటనలో పౌర అణు ఒప్పందం, రక్షణ ఒప్పందాలు, హరిత ఇంధన సహకారం వంటివాటిపై గణనీయ పురోగతి సాధించామని అమెరికా సంతృప్తి వ్యక్తం చేసింది. భారత్‌లో అణు విద్యుత్ కర్మాగారాల ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవాల్సింది ఇక అమెరికాలోని ప్రైవేటు సంస్థలేనని వైట్‌హౌస్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. పౌర అణు ఒప్పందంలో నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించేందుకు రెండు దేశాలు ఆదివారం ఒక అవగాహనకు వచ్చిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. 'రెండు ప్రభుత్వాలు ఒక అవగాహనకు వచ్చాయి. కొన్నేళ్లుగా చిక్కుముడిగా పరిణమించిన అంశాలపై ఒప్పందం కుదిరింది. మేం అవగాహనకు వచ్చిన పాలనాపరమైన ఏర్పాటును పరిశీలిస్తే.. రెండు ప్రభుత్వాల మధ్య అవసరమైన సమాచార మార్పిడి, సంప్రదింపుల వివరాలు తెలుస్తాయి. దీన్నిబట్టి భారత్, అమెరికాల మధ్య కుదిరిన 123 ఒప్పందాన్ని అమలు చేసేదిశగా ముందడుగు వేయవచ్చని భావిస్తున్నాం' అని అమెరికా జాతీయ భద్రతా ఉపసలహాదారు బెన్ రోడ్స్ తెలిపారు. అణు ప్రమాదాల్లో జవాబుదారీతనం అంశానికి సంబంధించి బీమా నిధి ఏర్పాటుకు భారత్ ముందుకొచ్చిందని చెప్పారు. ఆ నిధికి అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చడానికి సిద్ధపడిందన్నారు. దీనివల్ల భారత్‌లో వ్యాపారం చేసే కంపెనీలకు రిస్కును తగ్గించడానికి వీలవుతుందని చెప్పారు. 'రెండు ప్రభుత్వాలకు సంబంధించినంత వరకూ.. ముందడుగు వేయడానికి అవరోధంగా ఉన్న కీలకాంశాలపై

ఒక అవగాహనకు వచ్చినట్టేనని మేం విశ్వసిస్తున్నాం. ఇక భారత్‌లో పెట్టుబడులు పెట్టాలా? ఎప్పుడు పెట్టాలి.. వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకోవాల్సింది అమెరికా కంపెనీలే' అని రోడ్స్ స్పష్టంచేశారు. సంప్రదింపుల బృందం ద్వారా రెండు దేశాలు సంయుక్తంగా సాగించిన కృషిని బట్టి చూస్తే ఇదో గణనీయ విజయమేనని తెలిపారు. 123 ఒప్పందాన్ని అమలు చేయడానికి కార్యాచరణ సిద్ధమైనట్లేనని తాము భావిస్తున్నట్లు ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమాచారాన్ని మరింతగా ఇచ్చిపుచ్చుకోవడానికి సంబంధించిన ప్రతిపాదనలతో భారత్ ముందుకొచ్చిందని, వాటిపై తాము తృప్తి చెందామన్నారు. ప్రతిష్టంభనను తొలగించడంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రదర్శించిన నాయకత్వ పటిమను ఆయన కొనియాడారు.

విస్తృత భాగస్వామ్యానికి మరింత అవకాశం

ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలు, వాణిజ్య సంబంధాలకు సంబంధించి భారత్-అమెరికా మధ్య విస్తృత భాగస్వామ్యం కోసం ఇంకా అవకాశాలు ఉన్నాయని తాను భావిస్తున్నట్లు రోడ్స్ చెప్పారు. మొదట అనుకున్నదానికన్నా ఎక్కువ సమయంపాటే ఒబామా, మోదీలు కలసి గడిపారని తెలిపారు. ఈ ఇద్దరు నేతల మధ్య ఉన్న వ్యక్తిగత మైత్రి.. రెండు దేశాల సంబంధాలకు కీలకమని చెప్పారు. ఉగ్రవాద నిరోధం, ఆర్థిక వృద్ధి వంటి అంశాలపై రెండు దేశాల ఆలోచనలు ఒకేలా ఉన్నాయన్నారు. 'విలువలకు సంబంధించి ఈ రెండు ప్రజాస్వామ్య దేశాల భావనలు ఒక్కటే. అయితే అపనమ్మకంతో కూడిన పాత అలవాట్లు అంత తేలిగ్గా వదల్లేదు. కొన్ని అలవాట్లు మా వ్యవస్థల్లో పాతుకుపోయాయి. నిజం చెప్పాలంటే.. రెండు దేశాలకున్న ఇతర ప్రాధామ్యాల దృష్ట్యా ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచుకోవడానికి అవసరమైన సమయాన్ని, శక్తిని కేటాయించడానికి వీలుపడలేదు. ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపటపట్టిన మోదీ... అమెరికాతో సంబంధాలు తమకు చాలా ప్రాధాన్య అంశమని తేల్చి చెప్పారు. ఆ తర్వాత ఇద్దరు నేతలు కలసి వాషింగ్టన్‌లో కొంత సమయాన్ని కలసి గడిపారు. చాలా విస్తృత చర్చలు జరిపారు. మనస్సు విప్పి మాట్లాడుకున్నామని వారికి తెలుసు. భవిష్యత్ పథం గురించి ఆ ఇద్దరు నేతలకు స్పష్టత ఉంది' అని తెలిపారు.

హెచ్-1బీ వీసాలపై ఒబామా హామీ: భారత సాంకేతిక నిపుణులు ఎదుర్కొంటున్న హెచ్-1బీ వీసా సమస్యకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారాన్ని కనుగొంటామని భారత ప్రధాని నరేంద్ర మోదీకి తమ అధ్యక్షుడు ఒబామా హామీ ఇచ్చారని బెన్ రోడ్స్ తెలిపారు. అమెరికాలో తీసుకొనిరాదలచిన సమగ్ర వలస సంస్కరణల్లో ఈ అంశానికి ప్రాధాన్యమిస్తామని, దీనికోసం తమ అధికార యంత్రాంగం భారత ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతుందని ఒబామా తెలిపారని వెల్లడించారు.

## చైనా ఆందోళన అర్థరహితం

భారత్-అమెరికాల మధ్య సంబంధాల బలోపేతంపై చైనా ఆందోళనలు అర్థరహితమైనవని రోడ్స్ వ్యాఖ్యానించారు. ఈ రెండు దేశాల మిత్రబంధం దృఢతరం అవుతుందంటే చైనాను నిలువరించటానికో లేదా కట్టడి చేయటానికోకా దన్నారు. ఒబామా భారత పర్యటన పైపై మాటలకే పరిమితమన్న చైనా వ్యాఖ్యలపై రోడెస్ ఈ మాటలన్నారు.


## రష్యాతో భారత్ సంబంధాలపై..

సుదీర్ఘ కాలంగా రష్యాతో భారత్ కొనసాగిస్తున్న సంబంధాలను చూసి తామేమీ బెదిరిపోవటంలేదని అమెరికా జాతీయ భద్రతా ఉపసలహాదారు బెన్‌రోడ్స్ వ్యాఖ్యానించారు. భారత్‌తో తమ చెలిమి బలోపేతానికి అది అవరోధం కాబోదన్నారు. ప్రజాస్వామిక భారత్‌తో అమెరికా సంబంధాలు బలోపేతం కావటంపై తాము గర్విస్తున్నామని వెల్లడించారు. ఆయుధాల దిగుమతికి సంబంధించిన అనుబంధం గతంకన్నా మరింతపెరిగే క్రమంలో ఉందని తెలిపారు. ప్రచ్ఛన్న యుద్ధ కాలం నాటి అవిశ్వాసం, విభేదాలను అధిగమించి ముందుకుసాగుతామన్న విశ్వాసం వ్యక్తం చేశారు. భారత గణతంత్ర వేడుకల కవాతులో తన ముందు రష్యా యుద్ధ విమానాలు గగనతల విహారం చేయటం పట్ల ఒబామా ఇబ్బందికి గురికాలేదని రోడ్స్ తెలిపారు. దీని కన్నా ఎటువంటి వ్యవస్థ కలిగిన దేశంతో తాను సందర్శించిన భారత్ సంబంధాలు నెరుపుతున్నదన్నదే తమ అధ్యక్షుడు దృష్టి పథంలో మెదిలి ఉంటుందన్నారు.

# ఇదీ.. ఇంజినీరంగు!

సుప్రీంకోర్టు గడపదొక్కిన తెలంగాణలోని 163 ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో 143 కళాశాలల పరిస్థితి నిబంధనలకు అనుగుణంగా లేదని నిపుణుల కమిటీ తేల్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఐఐటీ హైదరాబాద్, బిట్స్ పిలానీ, జేఎన్‌టీయూహైదరాబాద్ నిపుణుల ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో కూడా కళాశాలల్లో లోపాలున్నట్లు వెల్లడైంది. జేఎన్‌టీయూహెచ్ అనుబంధ గుర్తింపును నిరాకరించటంతో ఈ ఏడాది ఇంజినీరింగ్, ఫార్మసీ కౌన్సెలింగ్‌లో 163 కళాశాలలకు అనుమతి లభించని విషయం తెలిసిందే. దీంతో అవి సుప్రీంకోర్టును ఆశ్రయించి పూరట పొందాయి. బయటి నిపుణులతో కూడిన కమిటీతో మళ్ళీ తనిఖీలు చేయాలని ఆదేశిస్తూ రెండో దశ కౌన్సెలింగ్‌లో

ఈ కాలేజీలకు సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. ఫలితంగా జేఎన్‌టీయూ మళ్ళీ నవంబరు, డిసెంబరు నెలల్లో 163 కళాశాలల్లో తనిఖీలు చేసింది. ఈ సందర్భంగా అఖిలభారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ), భారతీయ ఫార్మసీ మండలి (పీసీఐ) నిబంధనల ప్రకారం కళాశాల భవనాలు, విద్యార్థులు–అధ్యాపకుల నిష్పత్తి, అధ్యాపకుల అర్హతలు, ప్రయోగశాలలు, గ్రంథాలయ, కంప్యూటర్ తదితర సదుపాయాలను కళాశాలల్లో పరిశీలించింది. 143 కళాశాలల్లో సదుపాయాలు ఏమాత్రం గుర్తింపునివ్వటానికి అనుకూలంగా లేవని తేల్చారు. ఎనిమిది బీఫార్మసీ కళాశాలల్లో ఏడింటిలో నిబంధనల మేరకు సదుపాయాలు లేవని గుర్తింపు నిరాకరించారు. నిపుణుల కమిటీ పరిశీలించిన అంశాలను ఢిల్లీకి వెళ్ళి ఏఐసీటీఈ, పీసీఐ ఉన్నతాధికారుల దృష్టికి కూడా తెచ్చారు. నిపుణుల నివేదిక ప్రకారం జేఎన్‌టీయూ హైదరాబాద్ పలు నిర్ణయాలు తీసుకుందని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రమణారావు తెలిపారు. 'గత రెండు మూడేళ్ళుగా కళాశాలల్లో ఈ లోపాలు కొనసాగుతున్నాయి. సరిదిద్దుకుంటామంటూ వారిచ్చిన స్వీయ హామీ మేరకు గుర్తింపు కొనసాగిస్తూ



వచ్చాం. కానీ వారు హామీని నిలబెట్టుకోలేదు. అందుకే నిబంధనల మేరకు లేని కళాశాలలకు అనుబంధ గుర్తింపు నిలిపివేశాం. వచ్చే విద్యాసంవత్సరం లోపాల్ని సరిదిద్దుకుంటే మళ్ళీ గుర్తింపునకు దరఖాస్తు చేసుకోవచ్చు' అని ఆయన అన్నారు.

నిపుణుల నివేదికతో జేఎన్‌టీయూ తీసుకున్న నిర్ణయాలు...

- ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం సదుపాయాలు సరిగ్గా లేనందున, భారీగా లోపాలున్నందున 143 కాలేజీల్లోని 807 కోర్సులకు తొలి సంవత్సరం గుర్తింపు రద్దు. కేవలం 20 కళాశాలల్లోని 32 కోర్సులకే గుర్తింపు.
- ఈ కళాశాలల్లో (163) నడుస్తున్న రెండు, మూడు, నాలుగో సంవత్సరం కోర్సులకు సంబంధించి లోపాలను (అర్హులైన అధ్యాపకుల నియామకం వంటివి) సవరించుకోవటానికి 45 రోజుల గడువు.
- కంప్యూటర్లు, గ్రంథాలయాల్లో పుస్తకాలు, తదితర స్వల్ప లోపాలను సరిదిద్దుకోవటానికి 45 రోజుల గడువు
- నిబంధనలకు అనుగుణంగా లేని ఏడు బీఫార్మసీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీసీఐకి సిఫార్సు
- నకిలీ సిబ్బందిని చూపుతున్నారంటూ 16 కళాశాలలపై కేసు పెట్టగా వీటిలో ఆరు కళాశాలలకు వర్సిటీ నిబంధనల ప్రకారం గుర్తింపు లభించింది. అయితే... పోలీసుల దర్యాప్తు పూర్తయ్యేదాకా వీటి గుర్తింపును నిలిపివేయాలని నిర్ణయించారు.




# ఊరూరా గాంధీజికి ఘన నివాళి

## ఫ్యాక్ట్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు

శ్రీకాకుళం: జిల్లా వ్యాప్తంగా ప్రజలు శుక్రవారం మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించి ఘన నివాళి అర్పించారు. ముందుగా పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఫ్యాక్ట్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ప్రధాన ఆదినారాయణ, పుల్లటి రాజగోపాలరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గాంధీజీ ఆశించిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు అన్నారు. శ్రమలేని సంపద, నీతి లేని వ్యాపారం , విలువలు లేని రాజకీయం, శీల సంపద లేని విజ్ఞానం, మానవత్వం లేని శాస్త్రం, ఆత్మసాక్షి లేని ఆనందం, త్యాగ నిరతి లేని ఆరాధనలను పరిత్యజించడమే గాంధీజీ సూచించిన మార్గమని వివరించారు. అవినీతి రహిత సమాజాన్ని యువత నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్ట్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ప్రొఫెసర్ డి. విష్ణుమూర్తి, కె. పోలినాయుడు, మేధావుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచాది రాంబాబు, ఉపాధ్యక్షుడు కె.ఎల్.నాయుడు, మల్లేశ్వరరావు, కె. తవిటినాయుడు, అప్పలరాజు, ఎం సత్యనారాయణ, బి. జానకిరాం, పిగ. గోవిందరావు, పలు విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఎల్ఎన్‌పేట:** తురకపేట జంక్షన్‌లో గల ఎస్‌వీపీ పాఠశాలలో మహాత్మాగాంధీ వర్ధంతిని జరిపారు. ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీ ఆశయాలను నెరవేర్చడానికి నేటి యువత కృషి చేయాలన్నారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యానభ్యసించి దేశ ఔన్నత్యానికి అభివృద్ధికి పాటుపడాలని చెప్పారు. బి. సుజాత, కె. తవుడు, ఆర్. వాణిశ్రీ, ఎం బాలకృష్ణ, రమణయ్య, ఎస్. పద్మావతి మొదలైన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం: మహాత్ముని అడుగు జాడల్లో పయనించాలని ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు ఎన్. ఈశ్వరరావు, బగాది శ్రీరామ్మూర్తి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంవీ మల్లేశ్వరరావు, పొడుగు నర్సింగరాజు, పాతిన మురళీధర్, చంద్రశేకర్, జీవీ నాగభూషన్, రహీమ్ పాల్గొన్నారు.




# అవినీతి రహిత సమాజానికి కృషి చేయాలి

**పెరవలి రోడ్డు , సజ్జాపురం:** విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించి తద్వారా అవినీతి రహిత సమాజానికి కృషి చేయాలని ఫ్యాక్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డీవీవీఎస్ వర్మ పేర్కొన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఫ్యాక్ట్ ఆధ్వర్యంలో పట్టణంలో విద్యా సంస్థల్లో మౌనం పాటించి, అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల నుంచి స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరకు ప్రదర్శన జరిపారు. తదుపరి నిర్వహించిన సమావేశంలో వర్మ పాల్గొని మాట్లాడారు. గాంధీ ఆశించిన గ్రామ స్వరాజ్యానికి కృషి చేయాలన్నారు. వ్యవస్థాపక కార్యదర్శి డీబీ రమేష్ చంద్రబాబు మాట్లాడుతూ అన్ని సంస్థల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు తరవలిరావడం అభినందనీయమన్నారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టూరి సుబ్బారావు మాట్లాడుతూ విలువలతో కూడి విద్యా ఆవశ్యకతను పెంచితే అవినీతిని పారదోలవచ్చున్నారు. దీనికి అవసరమైన బోధన చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు.

సంస్థ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ తాతిన రామబ్రహ్మం మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం పెరిగిందన్నారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంతి ప్రధానాచార్యుడు గుబ్బల తమ్మయ్య, పురపాలక మాజీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, కోశాధికారి నందిగం సుధాకర్, పరిపాలన అధికారి డి. సుబ్బారావు, కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ పి. అరుణ, యు. లక్ష్మీ సుందరి, వీవీవీ సత్యనారాయణ రెడ్డి, అధ్యాపకేతర సిబ్బంది, పట్టణంలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



గుంటూరులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు..



జంగారెడ్డిగూడెంలో

బ్యానర్‌పై సంతకాలు చేస్తున్న ఎస్‌వీడీ డిగ్రీ కళాశాల విద్యార్థులు..




# మహాత్ముని ఆశయాలకు బలమిద్దాం

బెంజిసర్కిల్: గాంధీజీ వర్ధంతిని వాసవ్య మహిళా మండలి, ఫ్యాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడు మహా పాపాల నుంచి సమాజానికి విముక్తి కలిగించి, గాంధీజీ ప్రకటించిన అంశాలను బల పరుస్తూ పాఠశాలలు, ప్రధాన కూడళ్లలో బ్యానర్లపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు చెన్నుపాటి విద్య ఈ అంశాలకు మద్దతు ఇస్తూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని బెంజి సర్కిల్‌లోని తమ కార్యాలయంలో ప్రారంభించారు. వాసవ్య మహిళా మండలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణలంక: శాంతిని ఆయుధంగా చేసుకొని స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహాత్ముడు మహనీయుడని వాసవీ క్లబ్ విజయవాడ డైమండ్ కపుల్స్ సంఘ సభ్యులు గాంధీజిని కొనియాడారు. క్లబ్ ఆధ్వర్యంలో కృష్ణలంక బాపనయ్యనగర్ విజయ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం గాంధీజీ వర్ధంతిని నిర్వహించారు. ప్రాంగణంలోని గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. క్లబ్ రీజియన్ డిప్యూటీ గవర్నర్ రావూరి వెంకట నారాయణ, అధ్యక్షులు దమ్మాల వెంకట సుబ్బయ్య, వెంకట సీతారామయ్య, ప్రిన్సిపాల్ వెంగళరెడ్డి పాల్గొన్నారు.

## అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి

### వీసీ ప్రొఫెసర్ లజపతిరాయ్

అవినీతి రహత సమాజ నిర్మాణానికి అంద రూ కృషి చేయాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ హను మంతు లజపతిరాయ్ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా క్యాంపస్‌లో వర్సిటీ, ఫ్యాక్ట్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అవినీ తిని సమూలంగా పెకిలించాలన్నారు. గాంధీజీ ప్రకటించిన ఏడు పాపాలపై వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. శ్రమలేని సంపద, నీతిలేని వ్యాపారం, విలువలు లేని రాజకీయం, సత్ప్రవర్తన లేని విజ్ఞానసం, మానవీయత లేని శాస్త్రం, అంతరాత్మ లేని ఆనందం, త్యాగనిరతి లేని ఆరాధన వంటి వాటిన్నింటిపైనా ఉద్యమించాలన్నారు. నీతి సహిత రాజకీయాలు దేశ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయని విద్యార్థులు నళిని, శరత్, సింహాచలం తదితరులు అన్నారు. ఆ తర్వాత వారు సంతకాలు చేశారు.



ఒంగోలు కాలేజీలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు




గుంటూరులో గాంధీకి నివాళులర్పిస్తున్న మహిళలు..



ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల, భీమవరం..

# రేఖను దాటిపోదాం..

**7వ పేజీ తరువాయి**

పలకరించమని అరుస్తుంటాడు. లక్ష్మణ్ దాన్ని చూసి 'గుడ్ ఏం చేయాలని' అడిగాడు. 'చిన్నవా డు సూపర్ మేన్‌ని పలకరించమంటున్నాడు మీ వాణ్ణి సమాధానం చెప్పమనండి' అని పెన్ చేతికిచ్చా ను. ఒక్కక్షణం ఆలోచించి 'ద సూప ర్ మేన్ ఈజ్ ఎ మేన్ ఆఫ్ యాక్షన్ హి నెవర్ స్పీక్స్' అని రాసి సంతకం పెట్టాడు. మర్నాడు 'ఉదయం'లో ఇంటర్వ్యూతో సహా ఆ కార్టూన్ హిట్. అలా ఆయన్ని హైదరాబాద్‌లో, బెంగళూరులో చాలాసా ర్లు కలిశాం. లక్ష్మణ్ కార్టూన్‌ల గురించీ, ఆయనతో మా గుంపు అనుభవాల గురించీ ఎంతేనా ఎన్నైనా చెప్పుకో వచ్చు. శంకర్స్ వీక్లీ, తర్వాత ఈయనా, మరెంత మందో 70వ దశకం వరకూ తెచ్చిన సాంప్రదాయం ఎందుకో ముందుకు పోవడం లేదు. వెనక్కిపోతోంది కూడా. ఫలా నా బ్రాండ్ హ్యూమర్ కోసం పొద్దుటే ఆత్రంగా పేపర్ లాక్కుని చూసే పరిస్థితే లేదు. రాజకీయ పార్టీలూ, కార్పొరేట్ కంపెనీలూ ఎడ్వర్‌టైజింగ్ అన్నీ కలిసి జర్నలి జంలో కాళ్లూ, వేళ్లూ, ఒళ్లూ మొత్తం దూర్చేస్తున్నాయి. సొంత అభిప్రాయం, సొంత వ్యాఖ్యానం అంటే కత్తులు దూసే అసహనం కట్టలు తెంచుకుంటోంది. లక్ష్మణ్ తరం వెళ్లిపోయింది. ఈ తరానికి ఆ సంగతి తెలియా ల్సిన అవసరం లేదు. ఇదే జర్నలిజమనీ, ఇదే కార్టూనిం గ్ అనీ, మనమేం చేస్తే అది ఘనకార్యమనీ జబ్బలు చరు చుకుందాం. కన్వీనియంట్‌గా లక్ష్మణ్‌ని మరిచిపోదాం. లేకపోతే చాలా ఇన్‌కన్వీనియన్స్.

**- మోహన్**

**(వ్యాసకర్త ప్రముఖ కార్టూనిస్టు)**

# మూడవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

## 21, 22 తేదీల్లో విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం

మూడవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ఫిబ్రవరి 21, 22 తేదీల్లో విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం, కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ సభాప్రాంగణంలో జరుగుతాయి.

ఈ మహాసభల్లో తొలి భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన జరిగిన దరిమిలా తెలుగువారి భాషా సంస్కృతులు, చరిత్ర, సాంకేతిక ప్రగతికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించేలా నూతన విధాన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం గురించి, తెలుగు భాషకు క్లాసికల్ ప్రతిపత్తి లభించిన దరిమిలా పరిణామాలను పరిశీలించి, తెలుగు భాషా పరిశోధనల కోసం చేపట్టవలసిన చర్యలు ఇత్యాది అనేక సాహిత్యాంశాల గురించి చర్చలు జరుగుతాయి. నవ్యాంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న తొలి భారీ సాహిత్య కార్యక్రమం ఇది.

ప్రాంతాల కతీతంగా ప్రపంచంలో ఎల్లెడలా విస్తరించి, ప్రతిభా పాటవాలతో రాణిస్తున్న తెలుగు భాషాభిమానులకూ, సాహితీమూర్తులందరికీ స్వాగతం పలుకుతున్నాం. భువన విజయం, ఆశుకవితా విన్యాసం, కవిసమ్మేళనాలు, అవధానం, ఇతర సాహిత్య కార్యక్రమాలు ఉంటాయి. దాదాపు 100 మంది సాహితీ ప్రముఖులు, పరిశోధకులు, సాంకేతిక రంగ ప్రముఖులు ప్రసంగిస్తారు. '3వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల' కోసం రూ. 300 చొప్పున చెల్లించి ఇప్పటికే సుమారు 1500 మంది ప్రతినిధులుఉగా నమోదయ్యారు. వారందరూ ఇప్పుడు ఎలాంటి రుసుమూ చెల్లించనవసరం లేదు.

కొత్త రిజిస్ట్రేషన్లు గానీ, స్పాట్ రిజిస్ట్రేషన్లు గానీ చేయలేము. ప్రతినిధులు ముందుగా వచ్చి తమ రసీదు, గుర్తింపు కార్డులు చూపించి ధృవీకరణ పత్రమూ, మహాసభల ప్రత్యేక సంచిక కోసం కూపన్లు తీసుకోవాలి. సభా వేదికపైన వీలైన సమయంలో రచయితలు తమ రచనలను ఆవిష్కరింప చేసుకునే అవకాశం ఉంటుంది.

వివరాలకు ఫోన్ :

9440167697, 9440172642





భీమవరం కేజీఆర్ఎల్ కాలేజీలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కళాశాల ప్రతినిధులు



చిత్తూరు జిల్లా కొత్తకోటలో..



గుంటూరు జిల్లా శావల్యపురం..



శ్రీకాకుళం జిల్లాలో..

Posting Date 7-2-2015
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on February 5th, 2015



పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం జెడ్పీ స్కూల్‌లో ఫ్యాక్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు, విద్యార్థులు



తణుకులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

| | |
|---|---|
| **Book-Post**<br>PRINTED MATTER | To, |
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad